వార్త

ఆదివారం

1 డిసెంబరు, 2024

కాలమే విజయ సోపానం

విజయ్ దేవరకొండ సినిమాలో రష్మిక?

'శ్యామ్ సింగరాయ్ ఫేమ్' రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ కథానాయకుడుగా ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే! అయితే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ అప్‌డేట్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ ఉంది. ఈ సాంగ్‌ను రష్మిక మందన్నా చేత చేయిస్తే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నట్లు సమాచారం. రష్మిక మందన్నా ఈ సాంగ్ చేయడానికి ఒప్పుకుంటుందో లేదో చూడాలి మరి.

విజయ్ దేవరకొండతో రష్మిక మందన్నాకి మంచి స్నేహం ఉంది. కనుక స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా స్పెషల్ సాంగ్ చేస్తోందా? లేదా? అనేది కచ్చితంగా తెలియదు. ఈ చిత్రం షూటింగ్ వచ్చే సంవత్సరం జనవరిలో మొదలవుతుందని వినికిడి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో నాచులర్ స్టార్ నాని హీరోగా వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' సినిమా మంచి విజయం సాధించింది. దీంతో విజయ్ దేవరకొండ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

తారాతీరం

మోక్షజ్ఞ జోడీగా రాషా తడాని!



నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ హీరోగా ఎప్పుడెప్పుడు ఇంట్రీ ఇస్తాడా.. అని అభిమానులంతా చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో కాస్త ఆలస్యమవుతూనే వచ్చింది. కానీ ఆయన నటన, డ్యాన్సులు, ఫైట్లు, గుర్రపు స్వారీ వగైరా నేర్చుకుని రంగంలోకి దిగిపోయాడు.

సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఒక సినిమా చేయడానికి రంగం సిద్ధమైంది. ఈ సినిమాలో ప్రతి నాయకుడి పాత్రలో విక్రమ్ తనయుడు ధృవ్ కనిపించనున్నాడు. హీరోయిన్‌గా రవీనా టాండన్ కూతురు రాషా తడాని టాలీవుడ్‌కి పరిచయం కానున్నట్లు తెలుస్తోంది.

గతంలో రవీనా టాండన్ తెలుగులో బాలయ్యబాబుతో ఆమె చేసిన 'బంగారు బుల్లోడు' అప్పట్లో హిట్ అయింది. ఇప్పుడు ఆమె కూతురు బాలయ్య తనయుడితో జోడీ కడుతుండటం విశేషం. రాషా తడానికి మార్షల్ ఆర్ట్స్‌లో, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా పేరుంది. ఈ సినిమా వచ్చే నెల సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త

1 డిసెంబరు, 2024

మంచి ముత్యాలు

పుస్తకాలు దీపాల వంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది.

\- అంబేద్కర్

విషయ విశేషం

పుస్తక పఠనంతో మనో వికాసం....4

సంఘీ'భావం....5

అయోమయంలో ప్రభుత్వ సర్వేలు

కవర్ స్టోరీ

కాలమే

విజయ సోపానం

ఈవారం కవిత్వం...12

నిరంతర

పెరుగుతున్న డిజిటల్ నేరాలు....14

పేదల సేవలో.....18

కథ..20

అనుబంధం

సాహిత్యం...23

ఆంధ్రత్వం-ఆంధ్రభాష

పాత ఇంటిని కొనుగోలు......25

వివేకంతో ఆలోచించాలి....26

మట్టే ఔషధం....28

ఇంకా...

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

తాజా వార్తలు

శారీరక శ్రమ అవసరమే

శారీరకశ్రమ లేకుండా... ఎక్కువ సమయం కూర్చునే వారిలో అనారోగ్య సమస్యలు వస్తాయని తెలుసు. కానీ ఇటువంటి వారిలో అకాల వృద్ధాప్యం కూడా వస్తుందని అంటోంది తాజా అధ్యయనం. ఉదయం, సాయంత్రం జిమ్‌కు వెళ్తున్నాం కాబట్టి కంప్యూటర్లూ, మొబైళ్ల ముందు ఎంతసేపు కూర్చున్నా ఫర్వాలేదు అనుకొనే యువతకు ఈ అధ్యయనం కొన్ని ముఖ్యమైన విషయాలు వెల్లడించింది. యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా రివర్స్ సైడ్ శాస్త్రవేత్తలు 28 నుంచి 49 సంవత్సరాల మధ్యవయస్కులని ఎంచుకుని వాళ్ల వ్యాయామం, కూర్చునే అలవాట్లపై పరిశోధనలు చేశారు. వీళ్లలో ఎక్కువమంది తొమ్మిది నుంచి 16 గంటలపాటు కదలకుండా కూర్చునే ఉంటారట. కొందరైతే వారానికి 60 గంటలు కూడా కూర్చుంటున్నారట. ఇలా ఎక్కువసేపు కూర్చునే వారు ఏదో పేరుకు వ్యాయామం చేస్తే సరిపోదు. తగినంత సమయం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ఈ అధ్యయనం చెబుతోంది. లేదంటే గుండెజబ్బులతోపాటూ మానసిక సమస్యలు కూడా పెరిగి అవి వృద్ధాప్యాన్ని త్వరగా ఆహ్వానిస్తాయని చెబుతోందీ అధ్యయనం

కోడిపుంజు ఆకృతిలో భవనం

ఇదేంటి ఇన్ని భవనాల మధ్యలో ఇంత పెద్ద కోడిపుంజు ఉంది... చూడ్డానికి చుట్టుపక్కల భవంతుల కంటే భారీగా కనపడుతోంది. ఏదో తేడాగా ఉందే అనుకుంటున్నా రా! నిజమే... ఈ కోడిపుంజు కూడా ఒక భవనమే. ఫిలిప్పీన్స్‌లోని నెగ్రోస్ ఆక్సిడెంటల్ పట్టణంలో ఉంటుంది కాంప్యూస్టోహాన్ హైలాండ్ రిసార్ట్. అక్కడ కోడిపుంజు ఆకృతిలో ఉన్న ఆ భవనం పదిహేను గదులున్న ఓ హోటల్. నెగ్రోస్.. కోడిపందేలకూ, వాటికి సంబంధించిన వ్యాపారాలకూ చాలా ప్రసిద్ధి. ఆ స్ఫూర్తితోనే హోటల్ కట్టాలనిపించింది కాంప్యూస్టోహాన్ యజమాని భర్త అయిన రికార్డో కానో గ్వాపోటాను. ఏడాదిన్నరపాటు కష్టపడి నిర్మించిన ఆ హోటల్ ఈ మధ్యనే పూర్తయింది. దాన్ని చూస్తుంటే ఓ పెద్ద కోడిపుంజు అక్కడ నిల్చుందంటే నమ్మేస్తారు కూడా. చక్కగా సకల సౌకర్యాలతో తీర్చిదిద్దిన ఆ హోటల్ దాదాపు 120 అడుగుల ఎత్తు ఉండి ప్రపంచంలోనే కోడిపుంజు ఆకృతిలో ఉన్న అతి పెద్ద భవనంగా గుర్తింపు పొంది గిన్నిస్‌లోకి ఎక్కేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ కోడిపుంజు భలే ఉంది కదా!

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

పుస్తక పఠనంతో మనో వికాసం

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషనమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంథాలయమే. విజ్ఞాన సముపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం గ్రంథం. పుస్తకాన్ని నమ్మిన వాడు మహాజ్ఞాని అవుతాడు.

పుస్తకాన్ని, గ్రంథాలయాన్ని వ్యతిరేకించిన వాడు అపర అజ్ఞాని. ఒక పుస్తకం వేల మెదళ్ల ను వెలిగించే జ్ఞానదీపం. గ్రంథాలయ దర్శనంతో మనో విస్తృతి విస్తరిస్తుంది. గ్రంథాలయ ప్రాధాన్యాన్ని గుర్తించిన అయ్యంకి వెంకటరమణయ్య ప్రేరణతో 1968 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించుట ఆనవాయితీగా మారింది. స్వతంత్ర భారత తొలి ప్రధాని చాచా నెహ్రూ జన్మదినం 14 నవంబర్‌న ప్రారంభమై 20 నవంబర్ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తు న్నారు. భారత దేశవ్యాప్తంగా ప్రముఖ గ్రంథాలయాల జాబితాలో కలకత్తా జాతీయ లైబ్రరీ, ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, సరస్వతీ మహల్, చెన్నై అన్నా సెంటిమరీ లైబ్రరీ, గోవా కృష్ణదాస్ షమా కేంద్రీయ లైబ్రరీ, అలహాబాదు పబ్లిక్ లైబ్రరీ, తిరువనంతపురం స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హైదరాబాదు స్టేట్ సెంట్రల్ లైబ్రరీ లాంటివి చోటు దక్కించుకున్నాయి.

లుక్ కల్చర్ వద్దు బుక్ కల్చరే ముద్దు

డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. గూగులమ్మ ఒడిలో పుస్తకాలు దాక్కుంటున్నాయి. బుక్ కల్చర్ మాయమై లుక్ కల్చర్ ప్రత్యక్షం అవుతున్నది. గ్రంథాలయాలు అనాధలు అయిపోతున్నాయి. పుస్తకాలు నిరాదరణతో చిన్నబోతున్నాయి. చందమామ కథలు, బాలమిత్ర చతురలు అంతరించాయి. బామ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్తకపఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది. విశ్వ మానవాళిని పుస్తక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంథాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి గ్రంథాలయ వారోత్సవాలను వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది. ఈ వారోత్సవాల్లో భాగంగా పుస్తక పఠన ప్రయోజనాలు, రచయితలను గుర్తించడం, పుస్తక పఠనాన్ని నమ్మి ఉన్నత స్థితులకు ఎదిగిన మేధావులను సన్మానించుకోవడం, పుస్తక పఠనమే ప్రధాన అంశంగా విద్యాలయాల్లో పోటీలను నిర్వహించడం, పుస్తకాల విక్రయశాలల సందర్శన, పుస్తక ప్రదర్శనల నిర్వహణ, పుస్తకాలు కొని వ్యక్తిగత లైబ్రరీలను నెలకొల్పడం, పిల్లలచేత నీతి కథల పుస్తకాలను చదివించడం, పఠనాసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహకాలు బహిష్కరించడం లాంటి పలు కార్యక్రమాలను ఈ వారోత్సవాల్లో నిర్వహించవచ్చు.

గ్రంథ పఠన ప్రయోజనాలు

ఒకసారి పుస్తక పఠన సాగర ఈతను ప్రారంభిస్తే, విషయ పరిజ్ఞాన తీరాలకు చేరుతూ విజేతలుగా నిలవడానికి ప్రయత్నించాలి. పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంచగల ఇతర పుస్తకాలు, మ్యాగజైన్స్, పత్రికలు నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాన్ని చదివిన వారిని జ్ఞాన సరస్వతి దీవిస్తూ, ఉజ్వల భవిష్యత్తు, సమాజ గుర్తింపులను అందజేస్తుంది. పుస్తక పఠన అభిరుచితో ఓపిక, జ్ఞాన సంపన్నత, ఏకాగ్రత, విద్యావంతులుగా ఎదగడం, మేధో వికాసం ఫలించడం సహజంగానే జరుగుతుంది. పుస్తక పఠనం మెదడుకు వ్యాయామంగా పని చేసి చురుకుగా మార్చుతుంది. పుస్తక ఫలవంతమైన ఓ ఉత్సవంగా వర్ధిల్లుతుంది. పఠనం భారం కాదు, పరమానంద భరితం. పుస్తకాలను ప్రేమించిన వారిని ప్రపంచం అక్కున చేర్చుకుంటుంది. పుస్తక పఠనాన్ని బాల్యం నుంచే అలవాటు చేయాలని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. కత్తిని పదును చేయడానికి ఆకురాయి కావాలి. మెదడు



చురుకుదనం పెంచడానికి పుస్తక పఠనం తోడవ్వాలి. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, పారిభాషిక పదకోశం, ఆత్మవిశ్వాసం, లోకజ్ఞానం, శాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వికాసనం, జనరల్ నాలెడ్జ్, ఆకర్షనీయ వేతనం, సమాజంలో ఉన్నత స్థానం, కుటుంబ సంక్షేమం/అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు పెరుగుతాయి. నేటి ఆధునిక యువత గ్రంథాలయ దర్శనంచేస్తూ గ్రంథ పఠన ప్రపంచంలో మునిగి, జ్ఞాన సాగరం ఈది, ఎవరెస్టు శిఖరమంత ఎదిగి, రేపటి విజ్ఞాన వివేకవంతుల సమాజ స్థాపనకు బాటలు వేసి భవిష్యత్తుకు బాధ్యత కలిగిన విజ్ఞానవంతులను దేశానికి అందజేద్దాం, పుస్తకాన్ని నిత్య నేస్తంగా అక్కున చేర్చుకుందాం.

'సంఘీ' భావం

అయోమయంలో ప్రభుత్వ సర్వేలు

తెలంగాణలో నివసించే ప్రజల సమగ్ర సమాచారం కోసం గత ప్రభుత్వం సకల జనుల సర్వే నిర్వహించింది. ప్రస్తుతం కులాల వారీ వివరాల కోసం కుల గణన సర్వే కొనసాగుతోంది. అయితే ఈ సర్వేలు సమగ్ర లక్ష్యంతో, న్యాయపరమైన చిక్కులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం విఫలం అవుతున్నారని సర్వే జరుగుతున్న తీరును బట్టి అర్థం అవుతోంది. 2014 ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సకల జనుల సమగ్ర సర్వేను నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, దేశంలో మరెక్కడా జరగని తీరులో ఈ సర్వే జరిగింది. సర్వే నిర్వహించిన ఆగస్టు 19వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, పెట్రోలు బంకులు మూసివేశారు. దాదాపుగా రాష్ట్రవ్యాప్తంగా కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రశ్నావళిని రూపొందించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత సామాజిక, ఆర్థిక, విద్య, భూయాజమాన్య, వృత్తి సంబంధింత అంశాలపై సమగ్ర వివరాలు ఉండాలన్న లక్ష్యంగా సర్వేను నిర్వహించారు. మొత్తంగా ఎనిమిది అంశాలపై 94 ప్రశ్నాలతో సర్వే పత్రాలను ముద్రించారు. సుమారు నాలుగు లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది, ఇతర వ్యక్తులు ఈ సర్వేలో నిమగ్నమయ్యారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు నిరవధికంగా సర్వే కొనసాగింది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా సర్వే సిబ్బంది బృందాలుగా తిరుగుతూ ఉండటం కనిపించింది. ఈ సర్వే సమయంలో లేకపోతే ఇబ్బందులు కలుగుతాయన్న భయంతో దేశవిదేశాల్లో ఉన్న తెలంగాణవాసులు తమ స్వగ్రామాలకు చేరుకుని సర్వే సిబ్బందికి తమ కుటుంబ వివరాలను అందించారు. మొత్తం మీద సర్వే కార్యక్రమం రికార్డు స్థాయిలో పూర్తి చేశామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. ఈ సర్వే వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి అందులో పొందుపరిచారు. అయితే ఈ సర్వేలో లోపాలను గుర్తించి కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం ఈ వివరాలు బహిర్గతం చేయకూడదని న్యాయస్థానం ఆదేశించించడంతో సర్వే వివరాలు రికార్డులకు, కంప్యూటర్లకు మాత్రమే పరిమితం అయ్యాయి. ఈ సకల జనుల సర్వే వల్ల జనాలకు ఒరిగిందేమీ లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేను నిర్వహిస్తోంది. ఇందులో మొత్తం 56 ప్రధాన ప్రశ్నలకు 19 అనుబంధ ప్రశ్నలతో సర్వే పత్రాలను ముద్రించారు. ప్రభుత్వ టీచర్లను, సిబ్బందిని ఈ సర్వేకు వినియోగిస్తున్నారు. ప్రశ్నావళిలో కొన్నింటి వివరాలు ఇవ్వడానికి ప్రజలు నిరాకరిస్తున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సర్వేను వ్యతిరేకిస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. సర్వే నిర్వహించే వ్యక్తులకు తమ ఆస్తులు, ఇంట్లో ఉన్న పరికరాల, వాహనాలు, ఆధార్‌కార్డు వంటి వివరాలు ఎందుకు ఇవ్వాలని ఆనాడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదాయపు పన్నుశాఖ నిబంధనల ప్రకారం ఆదాయ, ఆస్తుల వివరాలు ఇతరులకు ఇవ్వవలసిన అవసరం లేదని రేవంత్‌రెడ్డి అప్పట్లో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కులగణన సర్వేలో కులంపై కేవలం మూడు ప్రశ్నలు మాత్రమే ఉన్నాయి. మిగిలినవన్నీ కేవలం వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే విధంగా ఉన్నాయి. ఎన్ని గదుల ఇంటిలో ఉన్నారు. దాని వైశాల్యం ఎంత, ఇంటో ఫ్రిజ్, కూలర్, టివి, సెల్‌ఫోన్, బైకు, కారు వంటివి ఉన్నాయా అన్న వివరాలు ఇవ్వవలసి ఉంటుంది. అదేవిధంగా బ్యాంకు రుణాలు, విద్యకు సంబంధించి ఏ పాఠశా లలో, ఏ మీడియంలో చదివారన్న ప్రశ్నలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాల అయితే అది రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల, కేంద్ర పాఠశాల, గురుకులమా, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాల అన్న వివరాలు ఇవ్వవలసి ఉంటుంది. ఈ ప్రశ్నావళిని పరిశీలి స్తే ఏ లక్ష్యంతో సర్వే జరుగుతుందో అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంటుంది. దీనితో ప్రతిపక్షాలకు ఈ సర్వేను విమర్శించేందుకు ఒక అంశంగా ఉపయోగపడుతోంది. ముఖ్యంగా ఆస్తుల వివరాలపై ఎక్కువ ప్రశ్నలు ఉండటంతో కేవలం ప్రభుత్వ పథకాలను నిలిపివేయడానికి మాత్రమే ఈ సర్వేను అమలుచేస్తున్నారన్న భావన కలుగుతోంది. ప్రస్తుతం మధ్య తరగతి కుటుంబాలు రేషన్‌కార్డును కలిగి ఉన్నాయి. దీనిపై బియ్యం ఉచితంగా పొందడంతో పాటు ఆరోగ్యశ్రీ వంటి వైద్య సదుపాయాన్ని పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మారిన జీవనశైలిని బట్టి ప్రతి ఇంట్లో కనీసం రెండు సెల్‌ఫోన్‌లు ఉంటున్నాయి. టివి, ఫ్రిజ్ తప్పనిసరిగా ఉండాల్సిన వస్తువులుగా ఉన్నాయి. నగరాలు, పట్టణాలు విస్తరించడం వల్ల ఉద్యోగ, ఉపాధి నిర్వహణకు బైక్ అవసరం ఉంది. విద్యార్థులకు ఫీజు మినహాయింపుకోసం ప్రస్తుతం ఆదాయ ధృవీకరణ పత్రం జతచేయాల్సి ఉంటుంది. ఈ విధానం కొనసాగుతుండగా మళ్లీ ఇంటింటికి వచ్చి ఆదాయం, ఆస్తుల వివరాలు ఎందుకు సేకరిస్తున్నారని ప్రజలు సర్వే సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. సర్వే చేసే ఉద్యోగులను లోనికి అనుమతి ఇవ్వడం లేదు. 56 ప్రధాన ప్రశ్నలు ఉంటే వాటిలో కేవలం 15 నుంచి 20 వాటికి మాత్రమే సమాధానాలు ఇవ్వడానికి అంగీకరిస్తు న్నారు. కులగ ణన పేరుతో ఎక్కువ ప్రశ్నలతో పత్రాలను రూపొందించడం వల్ల ఆశించిన మేరకు సర్వే కొనసాగడం లేదు. సకల జనుల సర్వే వల్ల తమకు ఒరిగిందేమీ లేదని, ప్రస్తుతం మరో సర్వే ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల అనుమానాలు తీర్చని పక్షంలో సర్వే సజావుగా కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కాలమే విజయ సోపానం

'కాలాన్ని వృథా చేయకండి, ఎందుకంటే అది మళ్ళీ తిరిగి రాలేదు' మహాత్మాగాంధీ, 'కాలం అనేది మనకు ఇచ్చిన అత్యంత విలువైన దానం, దాన్ని మీరు ఉప యోగించకపోతే అది మిగిలి పోయే అపరాధం' మహాత్మా జ్యోతిరావు ఫూలే. సృష్టిలో ప్రతిజీవికి 24గంటల సమయమే ఉంది. మానవుడికి కూడా ఇదే వర్తిస్తుంది. కొందరు ఈ 24గంట ల కాలాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకుని, ప్రపం చంలోనే పేరుప్రఖ్యాతలు గాంచారు. ఇదే సమయాన్ని మరికొందరు సరిగ్గా ఉపయోగించుకోకుండా, చెడు ప్రభా వాలతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. కాలమనేది మన చేతుల్లోనే ఉంది. దాన్ని సరిగ్గా వాడుకుంటే, అది మన విజయాలకు దోహదం చేస్తుంది. లేకపోతే మనల్ని పాతాళం లోకి నెట్టుతుంది. ఈ వివేచనంతోనైనా రానున్న ఏడాదిలో నైనా జీవించి, సక్సెస్ పొంది, ఇతరులను ఆద ర్శంగా నిలబడాలనే చిరుప్రయత్నమే ఈ వ్యాసం ఉద్దేశం.

కవర్‌స్టోరీ

వాసిలి సురేష్

మరికొన్ని రోజుల్లో నూతన సంవత్సరంలోకి ప్రవేశించబోతు న్నాం. మొన్ననే కొత్త ఏడాదిలోకి వచ్చినట్లుగా అనిపిస్తుంది, అంతలోనే సంవత్సరం చివరిమాసంలోకి వచ్చేశాం. టైమ్ పరుగులు తీస్తోంది. కాలంతో పాటు మనం కూడా పరుగులు తీయాల్సిందే. లేకపోతే విజయకెరటాలను చేరుకోలేం.

విద్యార్థి దశలో సమయము ప్రాముఖ్యత

విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ చదువుల్లో విజయాలను సాధించి తద్వారా వ్యక్తిగతాభివృద్ధి పొందుతారు. ప్రతిరోజు ఒక సమయ పట్టిక (టైమ్ టేబుల్) రూపొందించాలి. ఈ పట్టికలో చదవడం, వినోదం, విశ్రాంతి, శారీరక వ్యాయామం, ఇతర పనులకు సమయం కేటాయించాలి. ముఖ్యమైన పనులపై దృష్టి పెట్టాలి. అత్యంత ప్రాధాన్యమైన పనుల్ని ముందుగా చేయడం, తర్వాత తేలికపాటి పనులు చేయడం మంచిది. సమయాన్ని దేన్ని దానితో సమాంతరంగా చేయకుండా, ప్రతి పనికి అంచనా వేసి దానిని పూర్తి చేయడం జరగాలి, నిరంతరం గా నెమ్మదిగా లేదా ఆల స్యం చేయకుండా పనులు పూర్తి చేయ డం మంచిది, ఒకసారి అంతరాయం ఏర్పడి ఆగితే తర్వాత ముందుకు సాగడం కష్టంతో కూడుకున్న వ్యవహారం అని తెల్సుకోవాలి. విద్యార్థులు జ్ఞానాన్ని పెంచుకోవడం మాత్రమే కాకుండా, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకో వాలి. అందుకోసం వారంలో కాస్త సమ యం విశ్రాంతికి, వ్యాయామానికి కేటాయించాలి. గడిచే సమయాన్ని మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, గేమింగ్ లాంటి వాటితో వృథా చేయకూ డదు. ఫోన్లు వినియోగం, సోషల్ మీడియా వినియోగంపై స్వీయ నియంత్రణ పాటించాలి. పాఠ్యపుస్తకాలు చదవడంతో పాటుగా, ఇతర మోటివేషనల్ బుక్స్, స్ఫూర్తిదాయక పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి, నిరంతరం నేర్చుకోవడం ఒక అలవాటుగా మారాలి. విద్యార్థులు ప్రతి రోజూ కొత్త విషయాలను తెలుసు కోవాలి. అంతేగాక నేర్చుకోవ డానికి ప్రయత్నించాలి. ప్రతిరోజు విద్యార్థులు తాము చేస్తున్న పనుల్ని సమీక్షించి ఆత్మపరిశీలన చేసుకోవాలి, తద్వారా వాటిని మరింత మెరుగ్గా చేసేందుకు కృషి చేయాలి. విద్యార్థి దశలో సమయానికి ప్రాధాన్యత ముఖ్యమైనది. విద్యార్థి జీవితంలో సమయం సరిగ్గా వినియోగించకపోతే, అది విద్యా లక్ష్యాలను సాధించడంలో ఇబ్బందులు ఎదురవుతా యి. సమయాన్ని సక్రమంగా వినియోగించడం వల్ల విద్యార్థులు తమ అకడమిక్, నాన్ అకడమిక్ పనులన్నీ సమర్థవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. విద్యార్థి దశలో వివిధ అసైన్మెంట్లు, పరీక్షలు, ప్రాజెక్టులు, హోమ్‌వర్క్ సమయాన్ని సరిగ్గా కేటాయించేయాలి. సమయాన్ని సరైన విధంగా కేటాయిం చడం ద్వారా, విద్యార్థులు నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంచుకోవచ్చు. ఈ ప్రావీణ్యత వారిని తమ కెరీర్లో విజయం సాధించేందుకు తోడ్పడుతుంది. విద్యార్థులు తమ రోజు, వారం లేదా నెలలో

చేయాల్సిన పనులను వివరిస్తూ ఒక ప్లాన్‌పట్టిక తయారు చేసుకోవడం వారి సమయాన్ని మంచిగా వాడేందుకు సహాయ పడుతుంది. ముఖ్యమైన పనులను ముందుగానే గుర్తించి, అవి పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ఉదాహరణకు విద్యార్థి ఒక నిర్దిష్ట అంశంపై ఎక్కువ సమయం గడిపి, మిగతా వాటిని తక్కువ సమయంతో నిర్వహించవచ్చు.

విద్యార్థి దశలో, కుటుంబం, స్నేహితులు, హాబీలు, ఆత్మీయ సంబంధాలు కూడా చాలా ముఖ్యమైనవి, కాబట్టి, విద్యార్థులు చదువు, ఆటలతో పాటు తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కూడా సమ యం గడపడం మంచిది. ఇది వారి మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సంతృప్తిని పెంచుతుంది. విద్యార్థులు తమ సమయా న్ని విద్య, క్రీడలు, సంగీతం, చిత్రకళ, ఇతర హాబీలలో సరైన విధంగా వినియోగించడం, విద్యార్థి అభివృద్ధికి ముఖ్యమైనది. ఇవి మానసిక మరియు శారీరక ఆరోగ్యానికి తోడ్పడతాయి, సమాజంలో మెలిగే అద్భుతమైన వ్యక్తిత్వం కోసం, విద్యార్థులు అనేక స్వచ్ఛంద సేవా కార్యకలాపాలలో పాల్గొనవచ్చు. సేవా కార్యక్రమాలు సామాజిక బాధ్యతను అర్థం చేసుకునేలా చేస్తాయి. అన్నీ పనులకు సరైన సమయం కేటాయించడం ద్వారా, విద్యార్థులు తమ లక్ష్యాలను సులభం గా సాధించ గలుగుతారు. తమ సామర్థ్యాన్ని తాము తెలుసుకొని, రోజువారీ కార్యాలను కనీస సమయంలో పూర్తి చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది.

సమయాన్ని సరిగా పద్ధతిలో కేటాయించడం వల్ల, విద్యార్థి తరచుగా ఒత్తిడిని ఎదుర్కొనకపోవచ్చు, పరీక్షలు లేదా ప్రాజెక్టు సమీపిస్తున్న ప్పుడు, ముందుగానే ప్రణాళికలు చేసి, పనులను విడతలుగా పూర్తి చేయడం వల్ల, అనుకున్న పనులు సులభంగా పూర్తి చేయవచ్చు. చదువుతో పాటు, శారీరక ఆరోగ్యానికి కూడా సమయం కేటాయించడం ముఖ్యం. ప్రతి రోజు వ్యాయామం చేయడం, సరైన ఆహారం తీసుకోవడం, మంచి నిద్రపోవడం ద్వారా శారీరక మరియు మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది.

విద్యార్థి దశలో సమయాన్ని సరిగా వినియోగించడం, భావితరంలో మంచి కెరీర్ అవకాశాలను ఏర్పరుస్తుంది. విద్యార్థులు తమ అభిరుచులు నెపుణ్యాలు అదిమది చేసి వాటిపై దుష్టి పెడితే భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. సమయ నిర్వహణ అనేది విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో సహాయపడుతుంది, జ్ఞానం, నైపుణ్యాలు, మానసిక శక్తి మరియు సామాజిక నైపుణ్యాలలో సమతౌల్యం సాధించడం ద్వారా వారు సంపూర్ణ వ్యక్తిగా ఎదగవచ్చు. ఈ విధంగా, విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేయడం, మంచి విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత అభివృద్ధికి ఎంతో అవసరం.

నేడు యువత సమయాన్ని సరిగ్గా ఉపయోగించకుండా, దాని వల్ల తమ బంగారు భవిష్యత్తును తమ చేతులారా నాశనం చేసుకొంటున్నారు. దీనికి పలు కారణాలు ఉన్నాయి. యువత ఎక్కువగా సెల్ఫీలు, ఫోటోలు, సోషల్ మీడియా, గేమ్స్ వంటి విషయాలలో గడపడం వలన అధిక సమయం వృథా అవుతుంది.

చేయాల్సిన పనుల మీద నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తున్నారు. తమ లక్ష్యాల మీద స్పష్టత లేకపోవడం, అనిశ్చితి, జీవితంలో ధృఢమైన దిశలేమీ లేకపోవడం వల్ల కాలం వృథా అవుతున్నది. కొన్ని సందర్భాలలో సమాజం, కుటుంబం లేదా స్నేహితుల ఒత్తిడి వల్ల, యువత తమ కాలాన్ని సరిగ్గా ప్రయోజనకరమైన పనుల లో మలచడంలో విఫలమవుతుంది. ఈ పరిస్థితిని మార్చ డానికి, యువత దిశానిర్దేశం, సరైన లక్ష్యాలకు ప్రాధాన్యమి వ్వడం, సమయ నిర్వహణను మెరుగుపరచడం, జీవితం యొక్క ముఖ్యాంశాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం,

సోషల్ మీడియా వాడకంతో కాలం వృథా

సోషల్ మీడియా నందు ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్, యూట్యూబ్ వీడియోలు వంటి ప్లాట్‌ఫాం యువతను ఎక్కువ సమయం ఆకర్షిస్తున్నాయి. ఇవి ఎప్పుడయినా కేవలం అలసట నుంచి లేదా ఆందోళన నుంచి తాత్కాలిక రిలీఫ్ పొందడానికి మాత్రమే ఉపయోగపడాలి, కానీ అసలు పనులపై దృష్టి పెట్టడానికి సోషల్ మీడియా ఉపయోగపడదు. దీన్ని తెల్సుకుని యువత సోషల్ మీడియా వాడకంతో స్వీయ నియంత్రణ పాటించాలి.

సమయ నిర్వహణలో లోపం

యువత గడిపే సమయం సోషల్ మీడియా నందు ఉండడం, పోస్టులు చూడడం, కామెంట్స్, లైక్స్ అన్ని చూస్తూ సమయాన్ని వినోదానికి కేటాయిస్తారు. ఈ సమయాన్ని సమర్థవంతంగా ప్రయోజన కరమైన పనుల్లో పెడితే, వారు కొత్త విషయాలు నేర్చుకోవచ్చు, వ్యక్తిగతంగా పురోభివృద్ధి సాధించవచ్చు. సోషల్ మీడియా వల్ల ఒత్తిడి, దుష్ఫలితాలు సోషల్ మీడియా ఒత్తిడి యువత మీద ఉంటున్నది. యువత ఎక్కువగా సోషల్ మీడియాని వదిలి ఉండలేకపోవడం, మరొకరితో పోల్చుకోవడం, ఇతరుల్లా పనులు చేయడానికి పోటీపడటం జరుగుతుంది. దీంతో వాళ్ళ మానసిక ఆరోగ్యం ప్రభావితమయ్యి దెబ్బతింటున్నది. అంతేగాక అధిక సమయాన్ని వృథా చేయడం, కాలక్షేపం కోసం వినియోగించడం, అసలు సమయం సరైనా పనులు ఉపయోగించడానికి కుదరదు.

సోషల్ మీడియా నందు నిరంతరం కొత్త విషయాలు, వీడియోలు లాంటివి ఉండటం వలన అధిక సమయాన్ని మొబైల్ ఫోన్లు చూడటంతో కంటి చూపు సమస్యలు ఎదురవుతాయి. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టడంలో వైఫల్యం చెందుతారు.

కంటి చూపు సమస్యలు ఏర్పడే అవకాశం

సోషల్ మీడియా వినియోగం వల్ల మానసికంగా పనులపై దృష్టి కేంద్రీకృతం కాకుండా చేస్తుంది. సోషల్ మీడియా నందు నిరంతరం కొత్త విషయాలు, వీడియోలు లాంటివి ఉండటం వలన అధిక సమయాన్ని మొబైల్ ఫోన్లు చూడటంతో కంటి చూపు సమస్యలు ఎదురవుతాయి. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టడంలో వైఫల్యం చెందుతారు.

పరిష్కార మార్గాలు

సమయ నియంత్రణ పాటించాలి

యువత రోజువారీ చేయాల్సిన పనుల నిమిత్తం టైమ్ టేబుల్ ఏర్పాటు చేసుకోవాలి. సోషల్ మీడియా కోసం ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించడం చాలా ముఖ్యమైనది.

ప్రేరణ, లక్ష్యాల నిర్ణయాలు

యువత సరైన లక్ష్యం కల్గి ఉండాలి. ఆ లక్ష్యసాధనకు నిరంతరం ప్రేరణ పొందుతూ ఉండాలి, తమ జీవితంలో



ప్రాధాన్యతలను గుర్తించి, ఆ లక్ష్యాలపై దృష్టి పెట్టడం వల్ల వారు సమయం వృథా కాకుండా ప్రయోజనకరంగా ఉపయోగించ గలుగుతారు.

సామాజిక మానసిక ఆరోగ్యంపై దృష్టి

సోషల్ మీడియా ప్రభావాన్ని తగ్గించడానికి, యువత తమ వ్యక్తిగత సంబంధాలు, హాబీలు, నైపుణ్యాలు పెంచుకోవడానికి ప్రోత్సహించాలి. కెరీర్ పెంపొందించుకోవడంలో కాలం సద్వినియోగం చేసుకోవాలి. యువత గడిపే సమయాన్ని సమర్థవంతంగా, ఉత్పాదకంగా ఉపయోగించడం ద్వారా మాత్రమే తమ కెరీర్ను ముందుకు నడిపించవచ్చు. కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు ఏది సాధించాలనుకుంటున్నారో, ఆదిశలో కృషి చేయాలి. సాధించాల్సిన లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని, వాటిపై మాత్రమే పని చేయాలి. ఇతర అంశాలు, అనవసరమైన అంశాల జోలికి వెళ్లి సమయాన్ని వృథా చేసుకో కూడదు. ప్రతీ పనికి కాల నిర్ణయ పట్టికను ఏర్పరచుకోవాలి. రోజువారీ పనుల కోసం ఒక ప్లాన్ లేదా టాస్క్ లిస్ట్ తయారుచేసుకోవాలి. ప్రాధాన్యత పొందిన పనులను ముందు చేయాలి. కొన్ని నిర్దిష్ట సమయాలను ముఖ్యమైన పనుల కోసం మాత్రమే కేటాయించుకోవాలి ఉదాహరణకు, ప్రతిరోజు 12 గంటలు నైపుణ్యాల అభ్యాసానికి, 30 నిమిషాలు వృత్తి సంబంధి చదువులకు కేటాయించుకోవాలి, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి. మానవ వనరులు, సాంకేతికత, మేనేజిమెంట్, కమ్యూనికేషన్ వంటి అంశాల్లో అభ్యాసం చేసుకోవాలి. మార్కెట్ ట్రెండ్స్, కస్టమర్ అవసరాలు అనుసరించి ఈ నైపుణ్యాలు ఉపయోగపడతాయి. ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్స్ తదితర ద్వారా కొత్త అంశాలు నేర్చుకునేందుకు సహాయపడతాయి, సమయం, పనితీరు, ఉత్పాదకతలో పురోగతి ఉండేలా చూసుకోవాలి. ప్రగతిని అంచనా వేయడానికి ప్రతి వారం లేదా నెలలో ఒకసారి చేస్తున్న పనులను గూర్చి పునఃసమీక్ష చేయాలి. చేస్తున్న పనులు వల్ల కోరుకున్న ఫలితాలను ఇస్తున్నాయా? లేదా? ఎలాంటి మార్పులు అవసరమో చూడాలి. తదనుగుణంగా మార్పులు చేసుకొని ముందుకు సాగాలి. పని చేసే ప్రదేశం, చుట్టూ ఉండే పరిస్థితులు కూడా సమయ వినియోగాన్ని ప్రభావితం చేస్తాయి, శుభ్రంగా, ప్రశాంతంగా ఉండే వాతావరణం మన దృష్టిని, మనం చేస్తున్న పనులలో సామర్థ్యాన్ని పెంచుతుంది. కెరీర్ అభివృద్ధికి సంబంధించిన అవసరమైన వ్యక్తులతో సంబంధాలు పెంచుకోవాలి. తద్వారా కొత్త అవకాశాలు రావడంలో సహాయపడుతుంది. శారీరకంగా, మానసికంగా బలంగా ఉండాలి. అలసట లేకుండా పనిచేయడం ద్వారా మాత్రమే కెరీర్ను ఎఫెక్టివ్‌గా అభివృద్ధి చేయవచ్చు. సహకారంతో పని చేయడం తప్పనిసరి, కెరీర్ అభివృద్ధి కోసం మనతో పనిచేసే వ్యక్తులతో స్నేహపూర్వకంగా ఉండాలి. టీమ్ తో పని చేసేటప్పుడు కొత్త ఆలోచనలు, పరిష్కారమార్గాలు వస్తాయి, ఈ విధంగా సమయాన్ని సరిగ్గా వినియోగించి, కెరీర్లో ఎదుగుతూ, కొత్త విజయాలు సాధించవచ్చు.

కుటుంబానికి తగినంత సమయం కేటాయించాలి

అన్నింటి కన్నా కుటుంబానికి సమయం కేటాయించడం చాలా ముఖ్యమైనది, ఎందుకంటే కుటుంబం మన జీవితంలో అతి ముఖ్యమైన భాగం, కుటుంబంతో గడిపే సమయం మన అనుబంధాలను పెంచుతుంది, మన మానసిక, భావోద్వేగ ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది, మనం జీవితంలో ఎదుర్కొనే సవాళ్లకు ధైర్యాన్ని కలిగిస్తుంది, అందువల్ల కుటుంబానికి సమయం కేటాయించాలి. కుటుంబం, ముఖ్యంగా తల్లిదండ్రులు, సోదరులు, లేదా పిల్లలు మనకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తారు. వారితో సమయం గడిపితే మన అనుబంధాలు బలంగా ఉండే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యుల మధ్య చర్చలు, అనుభవాలు పంచుకోవడం, ఒకరికొకరు గౌరవించుకోవడం ద్వారా మమకారం పెరుగుతుంది. కుటుంబంలో గడిపే సమయం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. కుటుంబంలోని స్నేహపూర్వక మరియు ప్రేమపూరిత వాతావరణం ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుంది, కుటుంబం మనకు ఎప్పుడూ అవసరమైనప్పుడు మానసిక మద్దతును అందిస్తుంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరియు ఆదరణ, మన విజయాలపై మనకు నమ్మకాన్ని పెంచుతుంది, పిల్లలు తల్లిదండ్రులతో సమయం గడిపినప్పుడు, వారు మెరుగైన నైతిక విలువలు, విద్య మరియు సామాజిక నైపుణ్యాలు నేర్చుకుంటారు, పిల్లలు తల్లదండ్రుల సమక్షంలో ఉండి, కుటుంబ విలువలను అంగీకరించడం, పాటించడం ద్వారా మానసికంగా అభివృద్ధి చెందుతారు. పెద్దయిన తర్వాత వారు సమాజంలో కూడా మంచి పౌరులుగా ఉంటారు. మంచి కుటుంబ వాతావరణం ఆరోగ్యాన్ని పెంపొందించడానికి సహాయం చేస్తుంది. కుటుంబంలో ఒకరికొకరు సహాయం చేసుకోవడం, కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి, ఇతరుల వ్యక్తిగత అవసరాలను గుర్తించి, వాటికి సరైన పరిష్కారాలు ఇవ్వడం జరుగుతుంది. కుటుంబ సభ్యులు ఒకరికొకరు సాయం చేయడం ద్వారా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చు.

కుటుంబ సభ్యుల మధ్య ఒక దృఢమైన నమ్మకం ఉంటుంది, కుటుంబ సభ్యుల కోసం సమయాన్ని కేటాయించినప్పుడు, వారి విశ్వాసాన్ని పెంచుతూ, ఒక దృఢమైన, ప్రేమతో కూడిన బంధం ఏర్పడుతుంది.. కుటుంబంతో కలిసి వెళ్లే విహారయాత్రలు, సొంత పనులు చేయడం లేదా ఒకేసారి ఆహారం తీసుకోవడం వంటి సానుకూల అనుభవాలు, కుటుంబాలలో విలువలను తీసుకువస్తాయి. ఇవి జీవితంలో ఆనందం, సంతోషాన్ని పెంచుతాయి. పని ఒత్తిడి, బిజీ షెడ్యూల్లు, వ్యక్తిగత బాధ్యతలు ఉన్నా కూడా, కుటుంబంతో గడిపే సమయం జీవితానికి మరింత అర్థాన్ని కలిగిస్తుంది. కుటుంబానికి సమయం కేటాయించడం ద్వారా మన జీవితాన్ని మరింత ఆనందంగా, ప్రశాంతంగా, మరియు సంతృప్తిగా మారుస్తుంది.

వృద్ధాప్యంలో సమయానికి ప్రాధాన్యత

వృద్ధాప్యం అనేది వ్యక్తి జీవితంలో కొత్త దశను సూచిస్తుంది. ఇది విశ్రాంతి, ఆనందం, ఆత్మపరిశీలన, కుటుంబంతో గడిపే సమయానికి ప్రత్యేక స్థానం కలిగిస్తుంది. వృద్ధాప్యంలో సమయం సరైన విధంగా ఉపయోగించడం మరింత అవసరమవుతుంది, ఎందుకంటే ఈ దశలో శారీరక సామర్థ్యం, మానసిక స్థితి మారవచ్చు. కాబట్టి సకల కార్యకలాపాలను, అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సమయం కేటాయించడం అవసరం. వృద్ధాప్యంలో శారీరక ఆరోగ్యం ఎంతో ముఖ్యమై ఉంటుంది. రోజూ వ్యాయామం, వ్యాధులను నివారించడానికి పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యంతో గడపడం, మంచి నిద్ర తీసుకోవడం మొదలైన వాటికి సమయం కేటాయించడం ఎంతో అవసరం. ఈ దశలో, వ్యక్తి తమ గత జీవితాన్ని విజయాలను, నష్టాలను ఆలోచించి, ఆనందం మరియు సంతృప్తిని పొందేందుకు సమయాన్ని కేటాయిస్తాడు. ఆత్మపరిశీలనను ప్రోత్సహించడం, అభివృద్ధికి సరైన దిశను తీసుకోవడం, మరియు జీవితం మీద శాంతిని పొందడం వృద్ధాప్యంలో ముఖ్యమైనది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడం, వారి మద్దతు పొందడం ఎంతో ముఖ్యం, ఇది వ్యక్తి యొక్క మానసిక ఆరోగ్యానికి, మరియు ఆత్మవిశ్వాసానికి పునరుత్తేజం ఇచ్చే అవకాశం కల్పిస్తుంది. వృద్ధాప్యంలో కొత్త స్నేహాలు, సామాజిక కార్యకలాపాలలో పాల్గొనడం, వారితో కూర్చొని మాట్లాడటం, ప్రయాణాలు చేయడం వంటి విషయాలకు సమయం కేటాయించడం కూడా ముఖ్యమైంది. ఇది సామాజిక ఒంటరితనం పోగొట్టడానికి సహాయపడుతుంది.

వృద్ధాప్యంలో సమయాన్ని కేటాయించడం అనేది వ్యక్తి యొక్క శాంతిని, సంతోషాన్ని పెంచుతుంది. ఈ దశలో, వ్యక్తి ఎక్కువగా బిజి లైఫ్ను మర్చిపోయి, ఆత్మీయ సంబంధాలు కుటుంబం, చుట్టూ ఉన్న ప్రకృతిని ఆస్వాదించడంలో ఆనందాన్ని పొందుతారు. వృద్ధాప్యంలో హాబీలను కొనసాగించడం అంటే రచన, చిత్రకళ, సంగీతం లాంటి వాటిని కొనసాగించడం ద్వారా. ఆరోగ్యాన్ని, మానసిక ఉత్సాహాన్ని పొందుతారు. వృద్ధాప్యంలో మనం సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకొని, జీవితంలోని ప్రతి చిన్న విషయం కోసం ధన్యవాదాలు చెప్పడం, కృతజ్ఞత వ్యక్తం చేయడం, అనుభవాలను మరిచిపోలేదు అన్న భావన వ్యక్తికి శాంతిని మరియు సంతోషాన్ని కలిగిస్తుంది, సమయాన్ని సరిగ్గా వినియోగించడం వృద్ధావస్థలో జీవితానికి పరిపూర్ణతను తెస్తుంది. భవిష్యత్తులో ఉండే యథార్థం మరియు భావోద్వేగ విలువలను అంగీకరించి, ఆనందాన్ని సంతృప్తి పొందడంలో సమయం సరిగ్గా గడపడం అవసరం. ఈ విధంగా, వృద్ధాప్యం లో సమయాన్ని సద్వినియోగం చేయడం అనేది నైపుణ్యాల, అనుభవాల, సంబంధాల మరియు సామాజిక అనుబంధాల శక్తిని ఉపయోగించి శాంతిగా, సంతోషంగా జీవించడంలో ఒక కీలకమైన భాగంగా నిలుస్తుంది.

సమయం కేటాయించే సాధారణ నియమాలు

సమయంలో యాభై శాతం ముఖ్యంగా కెరీర్ మరియు పనికి సమయం కేటాయించాలి. దీంతో పాటు జీవితానికి ఇతర అంశాల మధ్య సమతౌల్యం ఉండాలి. వ్యక్తిగత అభివృద్ధి కోసం ఇరవై శాతం కేటాయించాలి, ఆత్మపరిశీలన, హాబీలు, శిక్షణ మొదలైన వాటి మీద ఉపయోగించాలి. ఆరోగ్యం కోసం పది శాతం ఉపయోగించాలి. వ్యాయామం, నుంచి ఆహారం తీసుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చును. కుటుంబం మరియు సామాజిక జీవితం కోసం ఇరవై శాతం ఉపయోగించాలి. కుటుంబంతో సమయం, స్నేహితులతో సమయం సామాజిక సేవ లాంటివి ఉండాలి. సమయ నిర్వహణ సమర్థవంతంగా ఉండాలంటే టైమ్ టేబుల్ లేదా షెడ్యూల్ ఉపయోగించడం ద్వారా రోజువారీ పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేసుకోవచ్చును. ప్రముఖ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అత్యవసరమైన పనులు ముందుగా పూర్తి చేయాలి. వాయిదా వేయకూడదు. సమయాన్ని ట్రాక్ చేసి యాప్స్ గూగుల్ కాలెండర్, రెమ్మైండర్ యాప్స్ లాంటివి ఉపయోగించాలి. పని చేయగలిగే స్థాయికి, వేగానికి అనుగుణంగా పనులను చిన్న భాగాలుగా విభజించడం ద్వారా సులభంగా వేగంగా పూర్తి చేయడానికి వీలవుతుంది, ఈ విధంగా, సమయాన్ని ప్రతీ దశలో సమర్థవంతంగా కేటాయించడం, జీవితం యొక్క అన్ని రంగాలలో సమతౌల్యాన్ని సాధించడానికి సహాయపడుతుంది. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు వ్యక్తిగత అభివృద్ధి కోసం కొత్త చెప్పన్యాలను నేర్చుకోవడం, కొత్త భాష టెక్నాలజీ లేదా ప్రత్యేకమైన సామర్థ్యాలు నూతన సంవత్సరంలో అడుగుపడుతున్న సందర్భంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు చాలానే ఉన్నాయి. వ్యక్తిగత అభివృద్ధి కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, కొత్త భాష, టెక్నాలజీ, లేదా ప్రత్యేకమైన సామర్థ్యాల నేర్చుకోవడం చేయాలి. జీవితంలో పొందాలనుకునే లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలి, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవడం చేయాలి. మంచి నిద్ర ధ్యానం లేదా యోగ లాంటివి చేయాలి. సమయాన్ని సమర్థవంతంగా వినియోగించేయాలి. ముఖ్యమైన పనులపై దృష్టి పెట్టడం, సమయానికి ప్రాధాన్యత ఇవ్వడం, మరిన్ని పనులను సమర్థవంతంగా నిర్వహించడం చేయాలి. ఆర్థిక వ్యయం, ఆదాయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, పొదుపు చేయడం చేయాలి, మొత్తం ఖర్చులను పర్యవేక్షిస్తూ ఉండాలి. కుటుంబంతో సమయం గడపడం ద్వారా కుటుంబ సభ్యులతో సంబంధాలను బలోపేతం చేయడం జరుగుతుంది. స్నేహితులతో, పరిచయాలతో సంబంధాలు మెరుగుపరచుకోవాలి స్వీయ అభిరుచులకు సమయం ఇవ్వాలి. ఆనందంగా జీవించేయాలి. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా ఈ నిర్ణయాల వల్ల మన జీవితంలో సానుకూల మార్పులను తీసుకురావడంలో సహాయపడతాయి. చాలామంది జీవితంలో ఎంజాయ్ చేయాలని, దానికోసం అమూల్యమైన సమయాన్ని వృధా చేస్తుంటారు. ఎంజాయ్ అవసరమే కానీ, అది మన కెరీర్‌కు దోహదం చేసేలా ఉండాలి. ఆ విధంగా ఉన్నప్పుడే మీరు ఆశించిన విజయాన్ని సాధించగలరు. ఆల్ ది బెస్ట్.

మనదేశంలో మనసుదోచే కొన్ని ప్రకృతి రాష్ట్రాల్లో సిక్కిం ఒకటి. నదులు, ఎత్తైన పర్వతాలు, కొండలు, మంచుతో కప్పబడే పచ్చటి మైదానాలు ఇలా...వీటిని చూసేందుకు ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ రాష్ట్రంలో ఒక్క రైల్వేస్టేషన్ లేదంటే ఆశ్చర్యమనిపిస్తుంది. ఆ కథ ఏంటో తెలుసుకుందామా!

రైల్వేస్టేషన్ లేని రాష్ట్రం

అధునాత కాలంలో టెక్నాలజీనే శాసించే స్థాయిలో ఉండి కూడా ఎందుకు ఆ రాష్ట్రంలో ఈ రైల్వే నిర్మాణం సాధ్యం కాలేదని సందేహాలు మెదులుతున్నాయి కదూ..! అందుకు కారణం కూడా లేకపోలేదు లెండీ!

భారతదేశం అత్యంత ప్రశంసనీయమైన రైల్వే నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న దేశం. అలాంటి దేశంలో రైల్వే లైన్లు లేని రాష్ట్రం కూడా ఉందంటే... నమ్మశక్యంగా లేదు కదా!. ఈ రాష్ట్రం మన హిమాలయాల ఒడిలో ఉంది. సినిమా వాళ్ల ఫేమస్ లోకేషన్ పాయింట్ కూడా ఇదే. మంచు కొండల్లో పాట అనగానే మనవాళ్లు చకచక వచ్చి వాలిపోయే రాష్ట్రం. అదేనండి సిక్కిం. ఈ రాష్ట్రం చూడటానికి ఎంతో అందంగా ఉంటుంది.

ఇక్కడ ఉండి ప్రకృతి రమ్యతకు ఎలాంటి వారైనా పరవశించిపోవాల్సిందే. అంతలా మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉండి ఈ రాష్ట్రానికి ఎందుకు రైల్వే సౌకర్యం లేదంటే.. అక్కడ ప్రతికూల వాతావరణమే ఇందుకు ప్రధాన కారణం. ఇక్కడ భూభాగంలో అనేక రకాల ప్రకృతి సవాళ్లు ఉన్నాయి. నిటారుగా ఉండి లోయలు, ఇరుకైన మార్గాలు, ఎత్తైన పర్వతాల వల్ల రైల్వే లైన్లు నిర్మించడం సాధ్యం కాలేదు.

అదీగాక ఇక్కడ తరుచుగా కొండదరియలు విరిగిపడతాయి. ఇక్కడ ఆ ప్రమాదం అత్యంత సర్వసాధారణం. ఈ పరిస్థితుల దృష్ట్యా ఇంతవరకు రైల్వే నిర్మాణం ఏర్పాట్లు చేయడం సాధ్యం కాలేదు. అయితే ఇప్పుడు అక్కడ పరిస్థితి క్రమంగా మారనుంది. ఇటీవలే ప్రధానమంత్రి మోడీ అక్కడ రైల్వే స్టేషన్‌ఉ శంకుస్థాపన చేశారు. నిర్మాణ దశలో ఉన్న ఈ సిక్కిం రంగిపో స్టేషన్‌ను టూరిజం, రక్షణ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తామని చెప్పారు రైల్వే మేనేజర్ అమర్జిత్ అగర్వాల్.

ఇక్కడ సరస్సుల ప్రత్యేక ఆకర్షణ, తప్పక సందర్శించాల్సిన టూరిజం స్పాట్లు కూడా ఈ సరస్సులే. రత్నాల వంటి భూమిలో పొదిగి ఉన్న ఆ సరస్సుల సహజ సౌందర్యం మనల్ని కట్టిపడేస్తుంది. పర్యాటకులవల్ల ఈ రాష్ట్రానికి అధిక ఆదాయం కూడా వస్తుంది. రైల్వేస్టేషన్ లేకపోవడం వల్ల పర్యాటకులు కూడా దూరప్రాంతాల నుంచి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. రైల్వేస్టేషన్ నిర్మించడం వల్ల ఈ రాష్ట్ర ఆదాయం కూడా మరింత పెరిగే అవకాశాలున్నాయి. ■



సరికొత్త ఫీచర్

టెక్ దిగ్గజం గూగుల్ ఓ సరికొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. లెర్న్ అబౌట్ పేరుతో తీసుకొచ్చిన ఈ ఫీచర్ యూజర్లకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ఉపయోగపడనుంది. ముఖ్యంగా ఈ విద్యా ప్రపంచంలో విద్యార్థులు, విద్యావేత్తలకు కావాల్సిన ఎడ్యుకేషనల్ ఇన్ఫర్మేషన్‌ను అందించడమే లక్ష్యంగా గూగుల్ దీన్ని తీసుకొచ్చింది.

ఈ లెర్న్ అబౌట్ ఫీచర్‌ను గూగుల్ LearnLM AI మోడల్ ద్వారా తీసుకొచ్చారు. ఇది వినియోగదారులు కొత్త విషయాలు నేర్చుకునేందుకు సహాయపడుతుంది. అంటే ఇది యూజర్లకు ఓ టీచర్ మాదిరిగా గైడ్ చేస్తుంది. ఇది ప్రతి అంశంపై మరింత సమగ్రమైన అవగాహనను అందించేందుకు సంబంధిత ఆర్టికల్స్, వీడియోస్‌ను కూడా అందిస్తుంది. ఈ లెర్న్ అబౌట్ ఫీచర్ అకాడమిక్ రీసెర్చ్ కు బాగా ఉపయోగపడుతుంది.

ఇది ChatGPT, చాట్‌బాట్‌ల మాదిరిగా కాకుండా కాస్త డిఫరెంట్ పనిచేస్తుంది. ఈ లెర్న్ అబౌట్ ఫీచర్ విశ్వసనీయ ఎడ్యుకేషనల్ ప్లాట్ ఫారమ్ ల నుంచి మాత్రమే సమాచారాన్ని సేకరించి అందిస్తుంది.

ఉదాహరణకు గూగుల్ జెమిని ఏఐ ఫీచర్‌ను సాధారణంగా ఏవైనా ప్రశ్నలు అడిగితే అది వికీపీడియా నుంచి డేటాను సేకరించి అందిస్తుంది.

అయితే లెర్న్ ఎబౌట్ ఫీచర్ మాత్రం యూనివర్స్ సైజ్ గురించి అడిగితే అది ఎడ్యూకేషనల్ సైట్స్, ఫిజిక్స్ ఫోరమ్‌ల నుంచి సమాచారాన్ని సేకరించి అందిస్తుంది.

ప్రస్తుతం టెస్టింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ లెర్న్ అబౌట్ టూల్ వెబ్ లో ట్రయల్ ఫీచర్‌గా అందుబాటులో ఉంది. అయితే ఇది కేవలం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉంది. ఇండియాలో ఇంకా అందుబాటులోకి రాలేదు. అయితే ఈ ఫీచర్ టెస్టింగ్ పూర్తయిన తర్వాత దీన్ని గ్లోబల్‌గా తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా జెమిని లైవ్ ప్లాట్‌ఫారమ్‌లో డాక్యుమెంట్ అవగాహన సామర్థ్యాలను అభివృద్ధి చేయడం పై పని చేస్తున్నట్లు గూగుల్ ఇటీవల వెల్లడించింది. ఈ ఏఐ జెమిని లైవ్ ఫీచర్ ఇకపై తెలుగులోనూ అందుబాటులోకి రానున్నట్లు ప్రకటించింది. ఈ సదుపాయాన్ని హిందీ లోనూ వినియోగించుకోవచ్చని తెలిపింది. తెలుగు, బెంగాలీ, మరాఠీ, ఇతర భాషల్లో త్వరలోనే అందుబాటులోకి రానున్నది. ●

హై రిస్క్ అలర్ట్



మీరుయాపిల్ కంపెనీకి చెందిన డివైజస్ యూజ్ చేస్తున్నారా? అయితే మీకో బిగ్ అలర్ట్. యాపిల్ యూజర్లకు కేంద్రం హై రిస్క్ అలర్ట్ జారీ చేసింది. యాపిల్ కంపెనీకి చెందిన ఐఫోన్లు, మ్యాక్స్, వాచీలు వంటి వాటిని వాడుతున్న వారు వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని కేంద్రం సూచించింది. ఔట్‌డేటెడ్ సాఫ్ట్‌వేర్ వాడుతున్న డివైజుల్లో సెక్యూరిటీలో పాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వశాఖ పరిధిలోని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (CERT-In) అడ్వైజరీని జారీ చేసింది. ఆయా డివైజులు వాడుతున్న వారికి హైరిస్క్ పొంచి ఉన్నట్లు తెలిపింది. దీంతో వెంటనే తమ సాఫ్ట్ వేర్ అప్ డేట్ చేసుకోవాలని కోరింది.

పాత సాఫ్ట్‌వేర్‌లో సెక్యూరిటీ లోపాల కారణంగా యాపిల్ డివైజుల్లో గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేసి సెన్సిటివ్ డేటాను దొంగిలించడం లేదా డేటా మానిప్యులేషన్‌కు పాల్పడే అవకాశం ఉందని సెర్ట్ఇన్ పేర్కొంది. ఐఓఎస్ 18.1 కంటే ముందు వెర్షన్ లేదా 17.7.1 కలిగిన ఐఫోన్లు, ఐ ప్యాడ్ఓఎస్ 18.1 కంటే ముందు లేదా 17.7.1 వెర్షన్ కలిగిన ఐ ప్యాడ్‌లు, పాత మ్యాక్ఓఎస్ వాడుతున్న మ్యాక్‌లు, వాచ్ ఓఎస్ 11 కంటే ముందు సాఫ్ట్‌వేర్ కలిగిన యాపిల్ వాచ్‌లకు ఈ ప్రమాదం పొంచి ఉందని సెర్ట్ఇ0న్ పేర్కొంది. వీటితో పాటు పాత టీవీఓఎస్, విజన్ఓఎస్, సఫారీ బ్రౌజర్లకూ ఇదే తరహా ముప్పు పొంచిఉందని సెర్ట్ఇన్ వెల్లడించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో లోపాలను యాపిల్ ఇదివరకే గుర్తించిందని, వాటికి పరిష్కారంగా కొత్త సెక్యూరిటీ అప్‌డేట్స్ అందిస్తున్నట్లు తెలిపింది. ఇంకా ఎవరైనా పాత సాఫ్ట్‌వేర్ వెర్షన్లు వాడుతూ ఉంటే వారు వెంటనే తమ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం ద్వారానే సైబర్ నేరగాళ్ల తమ వ్యక్తిగత వివరాలు దొంగలించకుండా కాపాడుకోవచ్చని స్పష్టం చేసింది. అప్పుడే సైబర్ రిస్క్‌ల నుంచి తప్పించుకోవడం సాధ్యపడుతుందని, ఈ నేపథ్యంలో పాత యాపిల్ డివైజ్‌లు వాడుతున్న వారు వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. ●

నిరంతర

కెరటం కూడా కవే
ఇసుకలో
ఏదో రాసి వెళ్లిపోతుంది
కవిత్వం కాదు గదా!

మళ్లీ వచ్చింది
ఈసారి ఏం రాస్తుందో!
అన్నాడు మా వాడు
పిచ్చివాడా!
ఇది మరో కెరటం అన్నాను.

మరి అది!?
సముద్రంలో కలిసిపోయింది
మరో తీరాన్ని
వెతుక్కోవడానికి.

– డా॥ ఎన్.గోపి

పక్షులం

ఆకసాన హాయిగా
ఎగిరే పక్షులం
స్వేచ్ఛకెపుడు మేమే
నిజమైన దూతలం.
కఠినమైపోయెను
మా గగన గమనం
కొనసాగుచుండెను
ఇదే అనుదినం.
ఒకనాటి అడవి
అంతా అదృశ్యం
ఎత్తైన సౌధాలతో
వెలిసింది పట్టణం.
లేదు మాకు ఎక్కడా
నికరమైన నివాసం
సంతతికి తావేది
దుష్కరం సంసారం.
పంటకై మందులు
గాలిలో కలుషితం
మాలోని కొన్ని తెగలు
ఆయెను మటుమాయం.
మా అసహాయ పరిస్థితి
ఇదే మీకు తెలిపెదం
ఏదో చేయబోతే
జరిగిపోవు దారుణం.
అందరికీ అందింతుము
ఎల్లప్పుడు సంతోషం
కలిసి గడుపుదామంటూ
ఇదే మా సందేశం.

– చంద్రునిపట్ల తిరుపతిరెడ్డి
ఒర్లాండో, ఫ్లోరిడా

ఈవారం కవిత్వం

నాస్తి

అవును
లోలోపల ఒక సర్పం సంచరిస్తుందని తెలియదు
అది విషపు కోరల్తో విస్తరిస్తుందని
'ప్రాణగండం' ఉందని అస్సలు ఎరుగదు
దేహమంతా
ప్రమాదపు గుడ్లు
పొదగబడుతున్నాయని తెలియనే తెలియదు.

చివరాఖరిలో
మృత్యువుతో మూగ వేదనతో
యుద్ధం చేసి చేసి
బతుకుతాననే నమ్మకంతోనే బతికి,
మరణించింది
ఎక్కడా, ఏదీ, ఎవరూ
ఏ దేవత కరుణించి, చూసి, కాచి, రక్షించలేకపోయారు.

సీతాకోకచిలకని తొండ మింగేసింది
పూలచెట్టుని పెనుగాలి విరిచేసింది
పికిలి పిక్చికని వడిసెలరాయి
ఢీకొట్టింది.

ఇప్పుడు
కార్తిక దీపం కంటివెలుగు
ఆ ఇంట్లో లేదు
ఒకానొక పచ్చని చెట్టు
పిట్టని వదిలేసి వెళ్లిపోయింది
రేపటి రోజున
ఇక చంద్రిక లేని
సూర్యుడు ఉదయించాలి.

– రవి నన్నపనేని

పుస్తక సమీక్ష

'సీతాన్వేషణం'-కవిరాజ హంస

ఆచార్య అనుమాండ్ల భూమయ్య ఆధ్యాత్మిక అంతర్వీక్షణతో 'జ్వలిత కౌసల్య', 'త్రిజట', 'కబంధమోక్షము' ఆవిష్కరించినట్టే మరొక వినూత్నరీతి పద్యకావ్యంగా శ్రీమద్రామాయణంలోని 'సీతాన్వేషణం' కూడా తెలుగు కావ్యంగా అద్భుతంగా వెలువరించారు. కవిగా, విమర్శకునిగా 50 గ్రంథాలు, విశేష ప్రసంగ వ్యాసాలతో లబ్ధ ప్రతిష్ఠులైన ఆచార్య భూమయ్య, వాల్మీకి రామాయణంలోని 154 సర్గల కథానేపథ్యం ఇతివృత్తంగా ఈ కావ్యకథా కథనాన్ని నడిపించారు.

ఆటవెలది తేటగీతిలలో 228 పద్యాలుగా సాగిన ఈ అన్వేషణలో కవిరాజహంస భూమయ్య కవిత్వరమ్యత, రసస్ఫూర్తి, ఉక్తివైచిత్రి, పదబంధాల పొందికతో పద్య ప్రేమికులైన రసహృదయులను అలరింపచేసారు. ఉత్తమ అధ్యాపకునిగా, నిరంతర అధ్యయనశీలిగా, ఉదాత్తసాహితీ విమర్శకునిగా, ఆచార్య అనుమాండ్ల భూమయ్య అంతరంగంలో మెదిలిన ఆలోచన ఈ పద్యకృతిగా రూపుదిద్దుకొని ఈ కథాకావ్యం చదువరుల రసహృదయాలకు ఆత్మదర్శన సాంత్వనం కలిగిస్తుంది.

(సీతాన్వేషణము, రచన: ఆచార్య అనుమాండ్ల భూమయ్య, వెల: రూ 100, ప్రతులకు: ఫ్లాట్ 519, బ్లాక్-ఏ, అపురూప జగపతి హైట్స్, ఆదర్శనగర్, ఉప్పల్, హైదరాబాద్)

- యర్రమిల్లి

మానవీయ విలువలు పరిరక్షించే కథలు



చిత్తూరు జిల్లా ప్రాంతీయుల అస్తిత్వ సంఘర్షణలని, అతిప్రతిభావంతంగా, ఒక దశాబ్దకాలంపైగా తెలుగు సాహిత్యాసక్తులకు పరిచయం చేస్తున్న ఆర్.సి. కృష్ణస్వామిరాజు 17వ కథాసంపుటి 'జక్కదొన'. లోగడ రాజు కథలు ముగ్గురాళ్లమిట్ట, గాండ్లమిట్ట, రాజనాలబండ లాంటి పరిసరాల్లో ఓ అతిసామాన్య వ్యక్తి. అందునా ఓ అమాయక బాలుడి దృష్టికోణం లోంచి, వాడి మాతృమూర్తి గురించి లేదా, సమీప బంధువుల గురించి కథల్లో చెబుతూ కనిపిస్తాయి. ప్రస్తుత కథాసంపుటి అందుకు భిన్నంగా ఉంటుంది. ఇందులోని 21కథలు రచయిత వివిధ సందర్భాలలో, వివిధ సాహిత్య సంస్థలకు పంపి బహుమతులు గెలుచుకున్నవి అయి ఉండటం విశేషం. లోగడ వీరి కథల్లో అంతర్లీనంగా హాస్యరసం చిప్పిరితే, ప్రస్తుత కథల్లో అతిమంచితనం మెతకతనం పనికి రాదనే నిష్ఠూరసత్యం (డబ్బు పాపిష్టిది), సమాజం కొరకు పాటుపడితే, అందరూ బాగుంటారని, ఆ అందరిలో ఎలక్ట్రిసిటీ సబ్‌స్టేషన్‌లో పనిచేసే కనకదాసు, ఆయన భార్య ఉంటారని (బుడబుక్కల బంగారు తల్లి), పెద్దలు ఏమి చేస్తే, పిల్లలు అదే చేస్తారన్న నిజం (రైట్..రైట్..) నిరూపితమౌతా. లోగడ వీరి రచనల్లాగే, స్థానిక, సామెతలు, జాతీయాలు తీగ అల్లుకోవాలంటే పందిరి ఉండాలి (గోల్కొండ చూసొద్దాం..)గంగ తాగితేనే కదా గంగజాతర (పొట్టిగుట్టలు)లాంటివి కోకొల్లలు! ప్రతీ కథలోనూ రాజుగారి 'బ్రాండ్' శైలి ఆకట్టుకునే అంశం. **(జక్కదొన, రచన: ఆర్.సి.కృష్ణస్వామిరాజు, వెల: రూ 140, ప్రతులకు: 22-4-71, బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీ, అంకరంపల్లి పోస్ట్, తిరుపతి)**

- కూర చిదంబరం

బాలల కథలు మూడుపుంజీల మూడు

బల్లా వరలక్ష్మి, బల్లా మోహన్‌రావు దంపతులకు ఈ పుస్తకం రచయిత అంకితం చేసారు. చందమామ బాలమిత్ర పుస్తకాల్లోని రంగురంగు బొమ్మలున్నాయి. కె.వి.రమణ (ఒడిశా), డికెన్స్ (వియెస్సెన్మూర్తి), మహంతి వెంకట్‌రావు, చక్కటి విలువైన ముందుమాటలు రాసారు. బాలభారతం మాసపత్రికలో ప్రచురణైన కథలున్నాయి. బిహేవియరల్ ఎకనామిక్స్ బాలల కథల రూపంలో అరుదైన సృజనాత్మక ప్రయోగం అన్నారు మహంతి వెంకటరావు, మొత్తం 15 కథలున్నాయి. అనర్ఘం అంచనా పిల్లలగ్రోవి, కొత్తకోణం, అనుసరణ, ఆప్యాయత, ఆశయం లాంటివి బాగున్నాయి.

'ఆటబొమ్మలు' కథ పిల్లలకు ఎంతో ప్రయోజనకర కథ. పిల్లలకు ఒక్కసారే ఖరీదైన బొమ్మలు కొని ఇవ్వరాదు. ముందు కొన్ని ఇచ్చి..వాటితో ఆటలు..ఆడించాలి. పుస్తకాలు చదివించాలి అని తన ఆఫీసుమిత్రుడైన రామారావు చెప్పి..అతనిలో మార్పు తెచ్చే 'చలపతి' పాత్ర నేటి తండ్రులకు చక్కటి ఆదర్శంగా ఉంది. 'ఆటబొమ్మలు' కొన్ని మాత్రమే పిల్లలకు తెచ్చి ఇచ్చి..వాటితో వారిని ఆడించాలి. వారితో ఆ బొమ్మలతో గడపాలి..విమల, గీత స్నేహితురాళ్లు. స్టీల్‌డబ్బాలో పూతరేకులు దాచివుంచడం వాటిని గీత గమనించక తినకపోవడం తన ప్రతిభను విమల చెప్పడం స్టీల్‌డబ్బాలో పూతరేకులు ఇవ్వడం చేస్తుంది. పక్కవారి ప్రతిభను మెచ్చుకొని ప్రోత్సహించాలి అని చెప్పే కథ 'గాజుజాడీ'. ఇలా అన్ని కథలు పిల్లల్లో ఆలోచన రెకెత్తిస్తాయి. **(మూడు పుంజీల మూడు, రచన: బల్లా విజయకుమార్, వెల: రూ 150, ప్రతులకు: బల్లా దివ్యమోహన, ఫ్లాట్ నె.503, ఆర్యా బూరుగుపల్లి అపార్ట్‌మెంట్స్, శ్రీవల్లినగర్, మధురవాడ, విశాఖపట్నం)**

- తంగిరాల చక్రవర్తి

కథాక్షేత్రంలో పేరూరు 'మడకెద్దులు'

పేరూరు బాలసుబ్రమణ్యం వెలువరించిన 15 కథల సంపుటి 'మడకెద్దులు'. మడకెద్దులంటే మడక దున్నడమే వాటిపని. కిట్టయ్య తన దగ్గరున్న రెండు కాడెద్దుల్నీ కూతురి సంతోషం కోసం అల్లుడికి అప్పగించేస్తాడు. అల్లుడు ఆ రెండు ఎడ్లనీ కసాయికి అమ్మేస్తాడు. ప్రాణప్రదంగా చూసుకున్న ఎద్దులు చివరకు కసాయివాడి కత్తికి బలవ్వడం తట్టుకోలేక కిట్టయ్య ఆత్మహత్య చేసుకుంటాడు. హృద్యమైన కథ 'మడకెద్దులు'. నలుగురు కొడుకులు వున్నా వృద్ధాప్యంలో ఆదరణను నోచుకోక చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డ ఓ వృద్ధుడి కథ 'శిశిరస్వప్నం'. పైరెండు కథల్లోనూ సమస్యకు మరణమే పరిష్కారంగా కథకుడు చూయిస్తాడు. ఈవాదం ఎంతవరకు సమంజసమో పేరూరు వారు ఆలోచించుకోవాలి. యిలా బాలసుబ్రమణ్యం ఎంచుకున్న కథాంశాలన్నీ వైవిధ్య భరితం. చిత్తూరు భాషా పరిమళంతో, చిక్కటి శిల్పంతో తీర్చిదిద్దిన కథలు. కానీ పెద్దగా మెరుపులు గానీ, ఊహించని మలుపులుగానీ, ఉత్కంఠ కలిగించే ముగింపులు కానీ వుండవు. ఓ సంఘటనను యథాతథంగా మనముందు వుంచిన భావన కలుగుతుంది. కథా నిర్మాణంలోని మెళకువలను ఆకళింపు చేసుకుంటే మంచి కథకుడిగా రాణిస్తాడని నా నమ్మకం. **(మడకెద్దులు, రచన: పేరూరు బాలసుబ్రమణ్యం, వెల: రూ 150, ప్రతులకు: 22-10-14, కొరమేనుగుంట, తిరుపతి)**

- రమణ వెలమకన్ని

ఇటీవల సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. క్షణాల్లో లక్షలాది, కోట్లాది రూపాయలను పోగొట్టుకుని, సైబర్ పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నవారెందరో ఉన్నారు. సమాజంలో సాంకేతికతకు తోడ్పాటు అందుతున్న కొద్దీ, సైబర్ నేరాలు కూడా ఎక్కువవుతున్నాయి. దీనిలో ముఖ్యంగా వృద్ధులు, డిజిటల్ పరిజ్ఞానంలో వెనుకబడి ఉన్న కారణంగా, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. దేశంలో ప్రతిరోజూ వేలాది మంది వృద్ధులు తమ సేవింగ్స్, వ్యక్తిగత సమాచారం కోల్పోతున్నారు.

పెరుగుతున్న డిజిటల్ నేరాలు

డా: చిట్యాల రవీందర్

భారత ప్రధాని నరేంద్ర మోదీ 'డిజిటల్ అరెస్టులు' అనే పదాన్ని ఖండించారు. అయితే, వాస్తవానికి, ఈ ప్రకటన మరింత అవగాహన అవసరాన్ని గుర్తు చేస్తోంది. సైబర్ నేరగాళ్ల తమ నకిలీ పద్ధతుల ద్వారా వృద్ధులను మోసం చేస్తున్నారు. వీటిని డిజిటల్ అరెస్టులు అని భావించడం కంటే, ఇక్కడ అవగాహన లోపమే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు.

సైబర్ నేరాల వల్ల నష్టపోయిన సొమ్ము

భారత దేశంలో నష్టాలు: ఇండియాలో సైబర్ నేరాల వల్ల ప్రతి ఏడాది లక్షల కోట్ల రూపాయలు కోల్పోతున్నారు. National Crime Records Bureau (NCRB) గణాంకాల ప్రకారం, 2022 లో సుమారు రూ. 500 కోట్ల నష్టం వాటిల్లింది.

వృద్ధులపై ప్రభావం: ప్రధానంగా వృద్ధులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. సైబర్ నేరగాళ్ల వృద్ధులను లక్ష్యంగా చేసుకుని బ్యాంక్ అకౌంట్ హ్యాకింగ్, ఫోన్ కాల్ స్కామ్స్, ఫిషింగ్ వంటి పద్ధతులు ఉపయోగిస్తున్నారు.

సైబర్ నేరాల రికవరీ వివరాలు

భారత ప్రభుత్వ పలు సంస్థలు నేరాల రికవరీ పట్ల కృషి చేస్తున్నాయి. సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 ద్వారా ప్రజలకు మోసపోయిన డబ్బును రికవరీ చేయడానికి సహాయం అందిస్తున్నారు. కానీ, రికవరీ శాతం పరిమితంగానే ఉండటం

గమనార్హం. 2023 గణాంకాల ప్రకారం, సైబర్ నేరాల్లో రూ. 100 కోట్లకు పైగా రికవరీ చేశారు. కానీ, ఇంకా పెద్ద మొత్తంలో సొమ్ము కోల్పోవడం జరుగుతుంది .

సైబర్ అవగాహన అవసరం

వృద్ధుల అవగాహన: వృద్ధులకు సైబర్ అవగాహన పెంపొందించటం అత్యవసరం. వాళ్ళను డిజిటల్ పరికరాల వినియోగంపై శిక్షణ ఇవ్వడం, భద్రతా జాగ్రత్తలు తీసుకోవడంపై మౌలిక అవగాహన ఇవ్వడం ద్వారా ఈ సమస్యను కొంతమేరకు అరికట్టవచ్చు.

ప్రభుత్వ కార్యక్రమాలు: భారత ప్రభుత్వం సైబర్ సురక్షిత భారత్ (Cyber Surakshit Bharat) వంటి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ కార్యక్రమాలు ప్రజల్లో సైబర్ భద్రతా అవగాహన పెంచే దిశగా పని చేస్తున్నాయి.

విభిన్నమైన సైబర్ మోసాల విధానాలు

ఫిషింగ్ మెసేజ్‌లు: బ్యాంక్ నుంచి వచ్చినట్లు, లక్కీ డ్రా గెలిచినట్లు వృద్ధులకు సందేశాలు పంపించడం ద్వారా నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్ల సమాచారాన్ని దోచుకుంటున్నారు.

వాలెట్ హ్యాకింగ్: గీశీ, డిజిటల్ వాలెట్ హ్యాకింగ్ ద్వారా డబ్బును అక్రమంగా తస్కరించడం.

అప్రమత్తత, భద్రతా సూచనలు

వీగిశి లను ఎవరితోనూ పంచుకోకండి: ఎక్కువగా వీగిశి ఆధారిత మోసాలు జరుగుతున్నాయి. వీగిశి లను సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ఖాతాలకు ప్రవేశం కోసం ఉపయోగిస్తారు. శోధనలో తెలియని లింకులకు, సందేశాలకు ప్రతిస్పందించకుండా ఉండాలి.

సైబర్ నేరాల భవిష్యత్తు: భవిష్యత్తులో సైబర్ నేరాలు మరింత అధునాతన మార్గాల్లో జరుగుతాయని అంచనా. ప్రభుత్వం ఆధునాతన సాంకేతిక పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు ప్రజల అవగాహనను కూడా పెంచాలి.

అవగాహన పెంపొందించడంలో ముఖ్యమైన మార్గాలు

ప్రముఖ మాధ్యమాలపై ప్రచారాలు: వృద్ధులకు సులువైన భాషలో అవగాహన కల్పించే ప్రకటనలు ప్రసారం చేయాలి.

స్కామ్ అవేర్‌నెస్ క్యాంప్స్: పలు ప్రాంతాల్లో అవగాహన కార్యాక్రమాలను నిర్వహించడం.

ఈ విధంగా ప్రజల అవగాహన పెంచడం, వారికి అవసరమైన భద్రతా సూచనలు ఇవ్వడం ద్వారా డిజిటల్ నేరాలను అధికంగా అరికట్టవచ్చు.



2023లో భారతదేశంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను బలవంతంగా మోసగించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) ప్రకారం, ఆ సంవత్సరంలో సుమారు రూ. 1,000 కోట్లకు పైగా భారతీయులు డబ్బు కోల్పోయినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. అయితే, నష్టపోయిన మొత్తాన్ని రికవరీ చేయడం చాలామందికి కష్టంగా మారింది.

సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 ద్వారా ఫిర్యాదులు అందించిన వారికి రికవరీ కోసం ప్రభుత్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2023లో రికవరీ అయిన మొత్తం సుమారు రూ. 200250 కోట్ల వరకు మాత్రమే ఉంది. దీనికి ప్రధాన కారణం ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కొరవడటం, రికవరీ ప్రక్రియలో ఉన్న సాంకేతిక సమస్యలు.

సైబర్ నేరగాళ్లు, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారి ఆర్థిక సమాచారం, వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసేందుకు వివిధ పద్ధతులను అవలంభిస్తున్నారు. ఈ నేరాలలో ముఖ్యంగా బ్యాంక్ అకౌంట్ ఫిషింగ్, ఫోన్‌కాల్ స్కామ్స్, ఫేక్ లాటరీ సందేశాలు, సోషల్ మీడియా మోసాలు ఎక్కువగా ఉన్నాయి. మహిళలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఎక్కువగా వినియోగించడం వీరి సైబర్ భద్రతకు ప్రాధాన్యతను పెంచుతోంది.

2023లో సైబర్ నేరాల గణాంకాలు పరిశీలిస్తే, 3040 సైబర్ నేరాలు మహిళలను టార్గెట్ చేస్తూ జరిగాయని తెలుస్తోంది. సైబర్ నేరాలు, ముఖ్యంగా మహిళలు వారి వ్యక్తిగత సమాచారాన్ని అజ్ఞాత వ్యక్తులతో పంచుకోవడం లేదా తప్పుడు లింకులు క్లిక్ చేయడం వల్ల జరుగుతున్నాయి.

టార్గెట్ చేయబడుతున్న పద్ధతులు:

ఫేక్ బ్యాంక్ కాల్స్: బ్యాంక్ ప్రతినిధులుగా నటిస్తూ మహిళల బ్యాంక్ డీటెయిల్స్ చెబితే అకౌంట్ నుండి డబ్బును క్షణాల్లో దోచేస్తున్నారు.

ఫిషింగ్ మెసేజ్‌లు: తప్పుడు లాటరీలు లేదా ఇన్‌స్టాంట్ రివార్డుల పేరుతో లింకులు పంపించి కూడా మోసగిస్తున్నారు.

మహిళలను సోషల్ మీడియా ద్వారా దగ్గరగా వచ్చి వారిని మోసగిస్తున్నారు.

రక్షణ మార్గాలు

ఎలాంటి బ్యాంక్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదు.

ఫేక్ లింకులు, మెసేజ్‌లు కనపడితే అప్రమత్తంగా ఉండాలి.

సైబర్ అవగాహన కల్పించే కార్యక్రమాలలో పాల్గొని సురక్షితంగా ఉండాలి.

ఇలా మహిళలకు సరైన భద్రతా సూచనలు ఇవ్వడం, వారికి సైబర్ భద్రతపై అవగాహన పెంచడం ద్వారా ఈ తరహా నేరాల నుండి రక్షణ కల్పించవచ్చు.

ప్రభుత్వం, పలు సైబర్ భద్రతా సంస్థలు సైబర్ నేరాలను అరికట్టడంలో ముందుకువచ్చినా, నష్టపోయిన డబ్బును పునరుద్ధరించడంలో ఇంకా మెరుగైన మార్గాలను అన్వేషించే అవసరం ఉంది.

కొబ్బరితో ఎలయప్పమ్

కేరళవాసుల సంప్రదాయ వంటకం ఎలయప్పమ్. చూడటానికి కజ్జికాయ ఆకారంలో కనిపించే ఈ మిఠాయిని దేవుడికి ప్రసాదంగానూ సమర్పిస్తారు. ఇది చేసే పద్ధతి కూడా కొంచెం ప్రత్యేకంగానే ఉంటుంది. ఇందుకోసం కప్పు బియ్యప్పిండి, మూడు చెంచాల నెయ్యి, ముప్పావు కప్పు బెల్లం, కొబ్బరికోరు కప్పు, చిటికెడు ఉప్పు, పావు చెంచా యాలకుల పొడి తీసుకోవాలి. ప్యాన్లో చెంచా నెయ్యి వేడయ్యాక.. బెల్లం, కొబ్బరికోరు, యాలవలపొడి వేసి కలియతిప్పుతుండాలి. చిక్క బడిన తర్వాత దించేయాలి. కడాయిలో బియ్యప్పిండిని వేయించాలి. మరోపాత్రలో ఒకటిన్నర కప్పు నీళ్లు, ఓ చెంచా నెయ్యి, చిటికెడు ఉప్పు వేసి రెండు నిమిషాలు మరిగించాలి. ఈ వేడినీళ్లను బియ్యప్పిండిలో పోసి గరిటెతో కలియతిప్పాలి. నీళ్లను పిండి పీల్చేసుకున్నాక చల్లబడుతుంది. అప్పుడికు. గరిటె తీసేసి చేత్తో బాగా కలపాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలు చేయాలి. అరిటాకుకు నెయ్యి రాసి, ఒక్కో బాలును చేత్తో తడుతూ చిన్న కొట్టెలా చేయాలి. అరిటాకు లేకుంటే బేకింగ్ పేపరు మీద చేయొచ్చు. దానిమీద రెండు స్పూన్ల కొబ్బరి బెల్లం స్టఫింగ్ పెట్టి, మధ్యలోకి మడిచి అంచులు కలిపేయాలి. తక్కిన పిండితోనూ ఇలాగే చేయాలి. అన్నీ అయ్యాక ఆవిరి మీద ఉడికించాలి. బెల్లం, కొబ్బరితో రుచి వస్తుంది. ఆవిరి మీద ఉడకడంతో ఆరోగ్యానికి కూడా మంచిది.

కథ

నిజమైన అభిమానులు

ఆరోజు ఆనందపురం ప్రజల ఆనందానికి అవధులు లేవు, కారణం ప్రవచనాలు చెప్పడంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన ప్రముఖ గురువు వారి ఊరికి వచ్చారు. గురువుకు పాదాభివందనాలు చేయడానికి, ఫోటోలు దిగడానికి ప్రజలు ఎగబడ్డారు.

"ఆగండి. గురువుగారు మీతో మాట్లాడే ఏర్పాటు మేము చేస్తాము" అని ప్రజలకు అడ్డుకట్టగా నిలిచారు. నిర్వాహకులు.

గురువును దగ్గరగా చూసి మాట్లాడాలని అనేకమంది పేద ప్రజలు ఎదురు చూస్తున్నారు. వారిని గురువు దరిదాపుల్లోకి కూడా వెళ్ళకుండా కంచెలా కొందరు నిలబడ్డారు. స్వర్ణకంకణాలు, గండపెండేరాలు, శాలువలు కలిగిన ధనవంతులు మాత్రమే గురువు వద్దకు చేరుకుని సత్కరించుకుంటున్నారు. గురువు కూడా ధనవంతుల మైకంలో పడిపోయాడు. పేదలతో ఒక్కమాట మాట్లాడటానికి కూడా ఇష్టపడలేదు. కొండంత అభిమానాన్ని గుండెల్లో దాచుకుని గురువు వద్దకు వచ్చిన పేదవారిని ఎవరూ పట్టించుకోలేదు.

ఇంతలో గురువు వేదికపై నుండి మెట్లు దిగుతూ కాలుజారి క్రింద పడ్డాడు. ఆయన తలకు బలమైన గాయమైంది. రక్తం విపరీతంగా కారుతుంది. అది మారుమూల ఉన్న పల్లెటూరు కావడం చేత సరైన వైద్యశాల లేదు.

ఈ దృశ్యాన్ని చూసి ధనవంతులంతా భయపడిపోయారు. ఈ పరిస్థితుల్లో గురువుకు ప్రాణాపాయం కలిగితే తమ మెడకు లేనిపోని సమస్యలు చుట్టుకుంటాయని ధనవంతులంతా ఆ ప్రాంగణం విడిచి వెళ్ళిపోయారు. గురువును అభిమానించే పేదలంతా అక్కడికి వచ్చారు. వారికి ప్రక్కనే ఒక నవారు మంచం కనిపించింది. గాయాలపాలైన గురువును పేదలంతా ఆ నవారు మంచంపై పడుకోబెట్టి మోసుకుంటూ సమీపాన పట్నంలో ఉన్న వైద్యశాలకు తీసుకుని వెళ్ళారు. వైద్యానికి చాలా డబ్బు ఖర్చు అవుతుందని వైద్యుడు చెప్పాడు. గురువును అభిమానించే పేదలంతా అప్పటికప్పుడు తమ వద్ద నున్న చిన్నా చితకా ఆభరణాలను అమ్మి ఆ డబ్బుతో గురువు వైద్యానికి కావలసిన మందులను కొని తెచ్చారు. కొందరు పేదలు రక్తదానం చేశారు. వైద్యులు ఎంతో శ్రమపడి గురువుకు వైద్య సేవలు అందించి బ్రతికించారు. మూడురోజుల తరువాత గురువు కళ్ళు తెరిచాడు. ఆయన కళ్ళ ఎదుట ఆనందపురం గ్రామ బీదప్రజలు కనిపించారు. గురువుకు విషయం అర్థమైంది. పేదల మానవత్వ, అభిమానం ముందు గురువు ప్రవచనాలు వెలవెలబోయాయి. గురువు కనులకు కప్పిన పొరలు తొలగిపోయాయి. ఆరోజు నుండి ఏ పేదవాడు తన అభిమానిని అని వచ్చినా గురువు తన గుండెలకు హత్తుకుని స్నేహపూర్వకంగా మాట్లాడటం మొదలు పెట్టాడు.

-షేక్ అబ్దుల్ హకీం జాని

రంగులు వేయండి

చిన్నారుల ముచ్చట్లు

వార్త ఆదివారం

బాలగేయం

బాబోయ్ చలి

చలి..చలి..
వణికిస్తున్న చలి
బయటకు రావాలంటే
వణకు పుట్టిస్తోంది
పచ్చని పైరుపై
మంచుదుప్పటి పరచి
చూడ ముచ్చటగా
ఉన్నది
గడ్డిపై
మంచుబిందువులు
సూర్యరశ్మికి
వజ్రాల్లా
మెరుస్తున్నాయ్
కానీ ఢిల్లీలో మాత్రం
పొగమంచు
కాలుష్యంతో ప్రజలు
అల్లాడుతున్నారు
అందమైన ప్రకృతి
వినాశనంవైపుకు
పరుగులుతీస్తోంది
మన నిర్లక్ష్యమే
మన ప్రాణాలను
హరిస్తోంది
స్వచ్ఛమైన గాలిలేదు
పచ్చని పైరులు
ఎండిపోతున్నాయ్
కళ్లు తెరచి ప్రకృతిని
కాపాడుకుందాం.

- సండేడెస్క్

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

- కె.గణేశిని, దౌలతాబాద్

ప్రశ్న: క్రికెట్‌లో తొలి ప్రపంచ కప్ నిర్వహణ ఎప్పుడు నిర్వహించారు?

జవాబు: గణేషిని! తొలి పరిమిత ఓవర్ల మ్యాచ్‌ను 1971లో మెల్బోర్న్ (ఆస్ట్రేలియా) క్రికెట్ మైదానంలో నిర్వహించారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ మ్యాచ్ అన్ని దేశాల క్రీడాకారులను ఆకర్షించింది, గొప్ప ఖ్యాతిని సంపాదించుకోగలిగింది. పర్యవసానంగా 1975లో ఐసిసి తొలి ప్రపంచ కప్‌ను ఇంగ్లండ్‌లో నిర్వహించింది. ఇందులో టెస్ట్ మ్యాచ్‌లు ఆడే దేశాలన్నీ పాల్గొన్నాయి.

- సి.మాధవ్, కోదాడ

ప్రశ్న: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వజ్రాలు ఏవి?



జవాబు: మాధవ్! రంగు లేని వజ్రాలకన్నా వివిధ వర్ణాలతో శోభిల్లే డైమండ్స్ మిన్నగా ఉంటాయి. విశ్వవిఖ్యాతి పొందిన సెఫెయిర్ బ్లూహోప్(భారత్), ఫ్యాన్సీ పింక్(ఆస్ట్రేలియా), ఎల్లోటిఫాని(దక్షిణాఫ్రికా), డెస్టన్ గ్రీన్(బ్రెజిల్) వజ్రాలన్నీ కలర్ డైమండ్స్ అని వాటి పేర్లే స్పష్టం చేస్తున్నాయి. గ్రేట్ స్టార్ ఆఫ్ ఆఫ్రికాగా పేరొందిన క్యుల్లినాన్ డైమండ్(530.04 క్యారెట్లు) నీలం వర్ణంలో ఉంటుంది. వివిధ రకాల క్యుల్లినాన్ వజ్రాలు బ్రిటిష్ క్రవున్‌లో పొదగబడి ఉన్నాయి. అతిపెద్ద పింక్ ఆర్‌లోఫ్ డైమండ్(189.62 క్యారెట్లు) మాస్కోలోని క్రెమ్లిన్ మ్యూజియంలో ఉంది. క్యూబన్ క్యాపిటల్(23.04 క్యారెట్లు), యురేకా(10.73 క్యారెట్స్), స్టార్ ఆఫ్ ఆది సౌత్(261.04 క్యారెట్లు), నిజాం(277 క్యారెట్లు), కోహినూర్(105 క్యారెట్లు), ది రిజెంట్(140.50 క్యారెట్లు), ది లెడోల్స్‌లె(170.20 క్యారెట్లు) ది టేలర్ బర్టన్(69.7 క్యారెట్లు), ది సాన్సీ(55.5 క్యారెట్లు) వంటి అంతర్జాతీయ ఖ్యాతినొందిన చారిత్రాత్మక వజ్రాలన్నీ కలర్ డైమండ్స్ కావడం గమనార్హం.

పేదల సేవలో..

కేరళలోని కన్నూర్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతుంటారు రకరకాల సమస్యలతో బాధపడే నిరుపేదరోగులు ఎందరో. భోజనం సమయానికి వాళ్ల దగ్గరికి కొందరు యువతీ యువకులు స్టీలు డబ్బాల్లో ఆహారం తీసుకొచ్చి అందిస్తారు. కాసేపటి తరువాత ఆ ఖాళీ డబ్బాలన్నీ తీసుకెళతారు. మరోవైపు కొందరు హాస్టల్ మెస్‌లో వంట చేస్తుంటే, ఇంకొందరు స్టీలు బాక్సులు శుభ్రం చేసి భోజనం సర్దుతుంటారు. ఇంతకీ వాళ్లంతా ఎవరో తెలుసా....

అక్కడ చదువుకునే వైద్య విద్యార్థులు చదువుతోపాటు పేదల ఆకలి తీర్చుతున్నారు వారంతా. ఎక్కడెక్కడి నుంచో కన్నూర్ మెడికల్ కాలేజీలో వైద్యం కోసం వస్తుంటారు రోగులు. రకరకాల సమస్యల కారణంగా అక్కడ చికిత్స పొందేవారికి ప్రతిరోజూ భోజనం కొనుక్కోవడం ఆర్థిక భారమవుతుంది. అది గమనించిన సూపరింటెండెంట్ సుదీప్ రోగం కంటే ఆకలే ఎక్కువగా కుంగదీస్తుందని భావించి ఆ పేదల ఆకలి తీర్చాలని నిర్ణయించుకున్నాడు. కాబోయే వైద్యులకు సామాజిక బాధ్యతను అలవర్చడం కూడా అవసరమే అనుకుని 'మీ టు, హంగర్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. అందుకోసం డాక్టర్లూ, వైద్యవిద్యార్థులూ, ఇతర సిబ్బందితో కలిసి బృందాన్ని ఏర్పాటు చేశాడు. అందరూ తలాకొంత డబ్బు వేసుకుని ప్రత్యేకంగా సరకులు కొనుగోలు చేస్తున్నారు. మెస్‌లో ఉదయం కొందరు సాయంత్రం అలా కొందరు. వండుతుంటే మరికొందరు, ఆహారం ప్యాక్ చేస్తుంటారు. మరికొందరు రోగుల వద్దకే భోజనం తీసుకెళ్లి అందిస్తుంటారు. ఇంకొందరు గిన్నెలు శుభ్రం చేస్తుంటారు. తమకున్న సమయాన్ని అందుకు తగ్గట్టుగానే ప్లాన్ చేసుకుని, పనులు నిర్వహిస్తుంటారు. అంతేకాదు పేదల సేవకు ఎక్కువ టైం కేటాయించేవారికి అదనంగా మార్కులు కూడా ఇస్తుంటారు.

ఉచితంగా జావ

చెన్నైలోని రాజీవ్‌గాంధీ గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఓ టీ షాప్ నడుపుతుంటాడు రాజీవ్. దగ్గర్లోనే అతని భార్యకు ఓ చిన్న హోటల్ ఉంది. దాదాపు పదేళ్లుగా వాటి మీదే ఆధారపడి బతుకుతున్నారు వాళ్లు. అయితే కొన్నాళ్ల క్రితం రాజీవ్ దగ్గరకి వచ్చిన ఓ మహిళ అన్నాన్ని మిక్సీ పట్టి ఇవ్వమని అడిగింది. క్యాన్సర్, హృద్రోగాల వంటి తీవ్ర జబ్బులతో బాధపడేవారూ, పైపు ద్వారా ఆహారాన్ని తీసుకునే ఎందరో హాస్పిటల్లో చికిత్స పొందుతుంటారు. అలాంటి వారికి జావలే ఆహారం. దూర ప్రాంతాల నుంచి వచ్చి చికిత్స పొందే వారికి జావలు అందుబాటులో లేక ఇబ్బంది పడేవారు. వాళ్ల బాధను అర్థం చేసుకున్న రాజీవ్ తానే రోగులకు జావ అందించాలని నిర్ణయించుకున్నాడు. అప్పట్నుంచీ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ రోగులకు జావలూ, పెరుగన్నం. ఇడ్లీ, రకరకాల రైస్లూ, కొబ్బరినీళ్లూ అందిస్తున్నాడు. రాత్రిపూట ఇడియాప్పం, కొబ్బరి పాలూ అందజేస్తున్నాడు. అందుకోసం ప్రత్యేకంగా కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్న రాజీవ్ తన టీ స్టాల్లోనే పెద్ద మొత్తంలో కొబ్బరిపాలను తయారు చేయిస్తున్నాడు.

పోషకాలతో కూడిన ఈ పాటు ఆరోగ్యానికి ఎంతో మంచివి కావడంతో అతను ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఉదయం ఐదొందల మందికి, రాత్రిపూట మూడొందల మందికి ఆహారం అందించడానికి నెలకు రెండు లక్షల దాకా ఖర్చు పెడుతున్నాడు. అద్దె ఇంట్లో ఉంటూ ఇద్దరు పిల్లల్ని చదివిస్తూ... సంపాదనలో అధిక భాగాన్ని పేదల తీర్చడం కోసం ఉపయోగిస్తున్నాడు.

పిల్లల్లో ఊబకాయం

మీ ఇంటి చుట్టు పక్కల మంచి కిరాణా దుకాణాలు, ఆరోగ్యకర మైన ఆహార పదార్థాలు లభించే వనరులు ఏం లేవా? అయితే కాస్త జాగ్రత్తగా ఉండా ల్సిందేనని పరిశోధకులు అంటున్నారు. ఇలాంటి ప్రదేశాల్లో నివసించే పిల్లల్లో ఊబకాయం ముప్పు పెరగటానికీ ఎక్కువ అవకాశం ఉంటోందని పరిశోధకులు వెల్లడించారు.

'ప్రిడియాట్రిక్ చైల్డ్ హెల్త్' లో ప్రచురితమైన ఓ అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. 'జర్నల్ ఫుడ్ ఇన్‌సెక్యూరిటీ అండ్ ఒబిసిటీ ఇన్ చిల్డ్రన్, ఏ సిస్టమాటిక్ రెవ్యూ' అనే అంశంపై చేపట్టిన అధ్యయనం లో కెనడాలోని ఎంసిమాస్టర్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎలిజబెత్ లీ ఫోర్డ్-జోన్స్‌తో పాటు మరో పరిశోధకురాలు జెనిన్‌స్కీ పాల్గొన్నా రు. ఈ నేపథ్యంలోనే పిల్లల్లో ఊబకాయం విషయాన్ని ఇంకాస్త బాగా అర్థం చేసుకోవటానికి పరిశోధకులు ఇటీవల దృష్టి సారించారు. చిన్న వయసులో ఆహార పదార్థాలు అందుబాటులో లేకపోవటం వల్ల భవిష్యత్తులో ఆరోగ్యం మీద చూపే ప్రభావాలను నిశితంగా పరిశీలించారు. ఈ అధ్యయనంలో భాగంగా పుట్టినప్పుడు, ఐదేళ్లు, పదేళ్లు, పదిహేనేళ్ల వయసులో ఉన్న పిల్లలను విభజించి వారి.. శరీర ఎత్తు బరువుల నిష్పత్తి (బీఎంఐ)ని విశ్లేషించారు. ఇందులో పట్టణాల్లో అర మైలు, గ్రామాల్లో 10 మైళ్ల కన్నా ఎక్కువ దూరంలో దుకాణాలు ఉండటాన్ని ఆహార పదార్థాలు అంతగా అందుబాటులో లేని ప్రదేశాలుగా పరిగణనలోకి తీసుకున్నారు. బాల్యంలో ఇలాంటి ప్రాంతాల్లో నివసించిన పిల్లలకు ఊబకాయం ముప్పు 50 కన్నా ఎక్కువగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అంతగా అందుబాటులో లేని ప్రదేశాల్లో నివసించిన గర్భిణులకు పుట్టిన పిల్లల్లో, అలాగే బాల్యంలో ఇలాంటి ప్రాంతాల్లో గడిపిన పిల్లల్లో మరింత బలమైన సంబంధం కనిపిస్తున్నట్టూ అధ్యయనంలో బహిర్గతమైంది. అందుకే ఈ దశల్లో మంచి ఆహారం లభించే ప్రాంతాల్లో నివసించేలా చూసుకుంటే భవిష్యత్తులో ఊబకాయం ముప్పు తగ్గించుకోవచ్చని పరిశోధకులు అంటున్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల వంటి పదార్థాలు అంతగా అందుబాటులో లేకపోతే అనారోగ్యకర ఆహారం తినే అవకాశం ఎక్కువని.. తద్వారా ఇది చివరికి ఊబకాయానికి దారితీస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

గాయమైందా?

మీకు ఏదైనా గాయం తగిలిందా? లేదా ఎముకలు విరిగిపోయాయా? ఇకపై ఎలాంటి ఇబ్బంది అక్కర్లేదు. ఇలాంటి వారికోసం అద్భుత మైన మందును కనిపెట్టారు పరిశోధకులు. కృత్రిమంగా రూపొందించే సింథటిక్ పెప్టైడ్స్, మానవ రక్తాన్ని కలిపి ఈ సరికొత్త పదార్థాన్ని తయారు చేశారు శాస్త్రవేత్తలు. ఇది గాయపడిన శరీర భాగాలను త్వరగా నయం అయ్యేలా చేస్తుందని చెబుతున్నారు. ఇంకా విరిగిన ఎముకలు బాగు చేయడంలోనూ ఇది మెరుగైన ఫలితాలు ఇచ్చిందని అంటున్నారు. యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్ హామ్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ అండ్ కెమికల్ ఇంజినీరింగ్ పరిశోధకులు దీనిని ఆవిష్కరించారు. భవిష్యత్తులో గాయాలు, వ్యాధుల చికిత్సలకు ఈ పరిశోధన ఎంతగానో ఉపయోగప డుతుందని భావిస్తున్నారు.

మేలైన ఆరోగ్యం కోసం..

మనకు తగిలే చిన్న గాయాలు, ఫ్యాక్చర్స్‌ను శరీరం చాలా అద్భుతంగా బాగు చేసుకుంటుంది. సహజంగా జరిగే ఈ ప్రక్రియలో మానవ రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో ఉండే హెమటోమా అనే పునరుత్పత్తికి సంబంధించిన పదార్థం ఇందులో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇది కణజాలాలను బాగుచేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ

నేపథ్యంలోనే మానవ రక్తానికి కృత్రిమంగా రూపొందించిన సింథటిక్ పెప్ టైడ్స్‌ను కలిపి ఓ బయోకోపరేటివ్ పదార్థాన్ని రూపొందించారు శాస్త్రవేత్తలు. ఇది అణువులు, కణాలు, కణజాలాలను సహజంగా బాగు చేయడానికి ఉపయోగపడు తుందని వివరించారు. ఈ బయోకోపరేటివ్ పదార్థం తయారీ, వినియోగం సులభంగా చేసుకోవచ్చని పరిశోధకులు వెల్లడించారు. దీనిని ఇప్పటికే జంతువుల రక్తంతో పరిశోధనలు చేయగా మెరుగైన ఫలితాలు ఇచ్చిందని పేర్కొన్నారు. జంతువుల ఎముకలను బాగు చేయడంలో ఇది విజయవంతం అయినట్లు పరిశోధక బృందం వెల్లడించింది. 'మానవుల రక్తాన్ని సులభంగా, సురక్షితంగా అత్యంత పునరుత్పత్తి ఇంప్లాంట్‌లుగా మార్చే అవకాశం ఉందని కనుగొనడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. వాస్తవానికి రక్తం ఉచితంగా లభ్యం అవుతుంది. ఇంకా అవసరమైతే రోగుల బంధువుల నుంచి సులభంగా పొందవ చ్చు. వైద్య చికిత్సలో భాగంగా ఎవరైనా సరే సులభంగా ఉపయోగించేలా ఓ టూల్ కిట్ ను ఏర్పాటు చేయడమై మా లక్ష్యం' అని నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు డాక్టర్ కోసిమో లిగోరియో పేర్కొన్నారు.

కథ

అనుబంధం

గిరి పట్ల

“ఎందుకమ్మా ఆడపిల్లకు చదువులు? నిన్న ఎప్పటికైనా ఒక అయ్య చేతిలో పెట్టాల్సిందే కదా! అనే తల్లిదండ్రులు ఇంకా మన దేశంలో చాలా మందే ఉన్నారు. ఆడపిల్లను అదుపులో పెట్టి అణిగి మణిగి ఉండండంటూ ఆంక్షలు పెట్టి, కట్టడి చేస్తూ కంచెలు వేస్తూ వారి ఎదుగుదలకు తల్లిదండ్రులే గోడలు కడుతున్నారు.

ప్రస్తుత రోజుల్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఎంతో అవసరం. అందుకు చదువే సరైన ఆయుధం. ఈ సృష్టికి దృష్టి స్త్రీ. ఇంటి గడప నుండి మొదలుకుని సమాజాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని సైతం నడిపించే ధీర వనిత స్త్రీ. అటువంటి స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య తేడా లేని సమ భాగస్వామ్యాన్ని చూపిస్తుంది. ప్రస్తుత రోజుల్లో స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యానికి మరింత చైతన్యం కావాలి. అప్పుడే ప్రతి మహిళ గొంతెత్తి నచ్చిన అభిప్రాయాలు చెప్పగలదు. సరైన నిర్ణయాలు తీసుకోగలదు.

ఇల్లాలిగా, తల్లిగా, చెల్లిగా, ఉద్యోగిగా ఎంతో ఓర్పుతో, నేర్పుతో తన బాధ్యతను ఎప్పటికప్పుడు చక్కదిద్దుకునే చురుకుదనం, నైపుణ్యం ఆమెలో మెండుగా ఉంటాయి. కావాల్సిందల్లా పుట్టినింట్లో, మెట్టినింట్లో ఆమెకు సపోర్ట్. అప్పుడే ఉన్న స్థానం నుండి ఉన్నత స్థానం వరకు వెళ్లగలదు.

చరిత్రనే తీసుకోండి.. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మొదటి మహిళ ఝాన్సీ లక్ష్మీబాయి. మొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే. ఏకైక తొలి మహిళా ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ. తొలి సుప్రీంకోర్టు మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఫాతిమా బీబీ. అంతెందుకు.. ప్రస్తుత మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... ఇలా ఎందరో మహిళలు మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచారు. అయినా కానీ మన దేశంలో ఇప్పటికీ ఇంకా మహిళా సాధికారత సంపూర్ణం కాకపోవడం ఎంతో విచారకరం” అంటూ క్లారిటీగా, కాన్ఫిడెన్స్‌గా స్టేజి పైన మాట్లాడుతున్న రూపను ఆర్తిగా చూస్తున్నాడు మురళి. ఆమెలోని ఆత్మవిశ్వాసం అతనికి బాగా నచ్చాయి.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తాను పని చేస్తున్న కంపెనీ నిర్వహించిన “వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి అవార్డ్స్” వేడుకల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళామణులకు అవార్డ్స్ ప్రదానోత్సవం జరుగుతుంది. అందులో భాగంగానే రూప వేదికపైన తన ప్రసంగాన్ని వినిపిస్తోంది.

ప్రోగ్రాం కవర్ చేయడానికి పబ్లిక్ టీవీ చానెల్ నుండి రిపోర్టర్ మురళి వచ్చాడు. రూప కట్టు-బొట్టు, నడక-నడత ముఖ్యంగా ఆమెలోని ఆత్మవిశ్వాసం అతన్ని కట్టిపడేశాయి. తన పని తను చేసుకుంటూ తదేకంగా ఆమెను చూస్తూ ఉన్నాడు. అతని చూపులు రూప పసిగడుతూనే ఉంది.

స్పీచ్ అనంతరం రూప దగ్గరకు వచ్చిన మురళి “హాయ్ అండీ. మీరిచ్చిన స్ఫూర్తి అద్భుతం. ఐ యాం మురళి, పబ్లిక్ టీవీ రిపోర్టర్” అని చెప్పి పరిచయం చేసుకున్నాడు.

నవ్వుతూ “థ్యాంక్సండీ’ అని చెప్పి కదిలింది.

“ఒక్క నిమిషం అండీ” అన్నాడు.

ఆగి “యా.. చెప్పండి” అంది.

“నెక్స్ట్ వీక్ మేం విలేజ్ కండక్ట్ చేస్తున్న ప్రోగ్రాంలో మహిళలకు ఇంతే స్ఫూర్తితో మీ నుండి మేం ఒక స్పీచ్ ఆశిస్తున్నాం. తప్పకుండా వచ్చి అక్కడి లేడీస్‌కు ఇంతే స్ఫూర్తి నింపాలని కోరుకుంటున్నాను” అన్నాడు.

అందుకు నవ్వుతూ “అవునా? తప్పకుండా. బట్ విలేజ్ అంటున్నారు??” అని అడిగింది.

“అవునండీ. హైదరాబాద్ నుండి జస్ట్ 160 కిలోమీటర్ల దూరంలో” అని చెప్పాడు.

“ఇంట్లో అమ్మని అడిగి చెప్తా. అంత దూరం, పైగా పల్లెటూరు కదా!” అంది.

“ఒకే. మీ రిప్లై కోసం వెయిట్ చేస్తుంటాను” అన్నాడు సంతోషంగా.

"సరే.. బై" అని చెప్పి కదిలింది.

వెళ్తుంటే ఆమెనే చూస్తున్నాడు మురళి, వెనక్కి తిరిగి చూస్తుందేమోనన్న ఆశతో. కానీ అతని ఆశ నిరాశయింది. ఛ.. అనుకుంటూ వెనుదిరిగేలోపు మురళిగారూ.. అని పిలిచింది.

ఆ పిలుపుతో ఉబ్బి తబ్బిబ్బయ్యి "చెప్పండి.." అన్నాడు స్పీడ్‌గా.

"ప్రోగ్రాంకి రమ్మని ఇన్వైట్ చేశారు కానీ కాంటాక్ట్‌లో ఉండడానికి ఫోన్ నంబర్ ఇవ్వలేదు" అని అడిగింది.

"సారీ.. సారీ.. అండి" అంటూ తన ఫోన్ నంబర్ ఇచ్చాడు.

"థాంక్యూ" అని చెప్పి అక్కడి నుంచి కదిలింది రూప.

మధ్యాహ్నం జరిగిన ప్రోగ్రాం రాత్రి టీవీలో వస్తుంటే తీక్షణంగా వీక్షిస్తున్న రూపను చూసి "ఏంటి? ఇవాళ వచ్చిన దగ్గరి నుండి టీవీకి అతుక్కుపోయావ్! భోజనం వద్దా? నిన్ను నువ్వు టీవీలో చూసుకుంటే కడుపు నిండిపోయిందా? ముందు అన్నం తిను" అంటూ అన్నం పెట్టి ఉన్న ప్లేట్‌ని రూపకు అందివ్వబోయింది తల్లి.

"అబ్బా.. ఉండమ్మా. కాసేపయ్యాక తింటాలే" ప్లేట్ తీసుకుని టీపాయ్ పైన పెడ్తూ చెప్పింది.

నిట్టూర్చిన తల్లి "సరే నీకిష్టం వచ్చినప్పుడు తిను. నా మాట నువ్వు ఎందుకు వింటావ్? నేను వద్దన్న పనే నువ్వు చేస్తావ్. హాయిగా ఉద్యోగం చేసుకోమని చెబితే ఉద్యమాలు, సేవలు, స్వేచ్ఛ అంటూ ఉపన్యాసాలు ఇస్తోంది" అంది కోపంగా.

తల్లి మాటలు పట్టించుకోకుండా "అమ్మా, పబ్లిక్ టీవీ చానెల్ రిపోర్టర్ మురళి అట, నా స్పీచ్ తనకు బాగా నచ్చిందనీ, తను ఒక విలేజ్‌లో కండక్ట్ చేస్తున్న ప్రోగ్రాంలో నెక్ట్స్ వీక్ ఒక స్పీచ్ ఇవ్వాలని అడిగాడు. సరేనని చెప్పాను. వీలైతే ఇద్దరం కలిసి వెళ్దాం" అంది.

ఆ మాటకు అప్పటికే కోపంగా ఉన్న తల్లికి మరింత కోపం వచ్చింది.

"నేనేం చెబుతున్నాను.. నువ్వేం చెప్తున్నావ్. మతుండే మాట్లాడుతున్నావా? విలేజ్ అన్నా, విలేజ్ మనుషులన్నా నచ్చకనే ఇక్కడికి వచ్చి పడ్డాం. ఇప్పుడు మళ్లీ నువ్వు అదే బాట పడుతున్నావ్! నోరు మూసుకొని అన్నం తిని పడుకో, చాలా పొద్దు పోయింది" అంటూ సీరియస్‌గా చెప్పింది.

తల్లి కోపానికి అలిగిన రూప "నువ్వొస్తానంటేనే నేను వెళ్తాను. అలా అని మాట ఇస్తేనే ఇప్పుడు అన్నం తింటాను" అని చెప్పింది.

"అబ్బా... నీతో ఇదే తలనొప్పి. సరే! వారం తర్వాత కదా చూద్దాంలే. ముందు అన్నం తిను" అంది తల్లి.

వారం తరువాత.......

విలేజ్‌లో లొకేషన్‌కు వచ్చి ఆగిన కారులోంచి బయటకి చూసిన తల్లి కళ్లకు 'ఉమా మాధవ్ మహిళా సాధికారత ట్రస్టు' అని పెద్దపెద్ద అక్షరాలతో ఉన్న బోర్డు కనిపించింది. ఒక్క క్షణం ఆమె గుండె ఆగి మళ్లీ కొట్టుకుంది.

తల్లి కోపానికి అలిగిన రూప "నువ్వొస్తానంటేనే నేను వెళ్తాను. అలా అని మాట ఇస్తేనే ఇప్పుడు అన్నం తింటాను" అని చెప్పింది.
"అబ్బా... నీతో ఇదే తలనొప్పి. సరే! వారం తర్వాత కదా చూద్దాంలే. ముందు అన్నం తిను" అంది తల్లి.

మనసు కలవరపడింది. అసలే ఇష్టం లేకపోయినా కూతురు పట్టుదలకు తల వంచక తప్పలేదు.

ఇద్దరూ కారు దిగి గేటు లోపలకి అడుగు పెట్టారు.

ఆ లోగిలిలోని విశాలమైన స్థలంలో యేపుగా పెరిగిన చెట్లు అక్కడ అడుగు పెట్టిన వారికి స్వాగతమంటూ సెల్యూట్ చేస్తున్నట్టుగా దర్శనమిస్తున్నాయి. అలా ముందుకు వెళ్తే రకరకాల పూలతోటలు నవ్వుతూ పలకరిస్తున్నాయి. అవి దాటగానే ట్రస్టు భవనం, దాని ముందు ఇరువైపులా చల్లని నీడనిచ్చే చెట్లు, ఆ చెట్ల నీడల్లో విశాలమైన అరుగులు వున్నాయి.

అక్కడ వృద్ధ మహిళలు నడకకు వచ్చి సేద తీరుతూ కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. అటు పక్కనే 'ఉమాదేవి గ్రంథాలయం' ఉంది. అది చూసి తల్లీ కూతుళ్లు ఒకరినొకరు చూసుకున్నారు. ఆ ప్రదేశం వారిద్దరికీ ఎంతో నచ్చింది. లైబ్రరీలో వున్న అన్ని రకాల నవలలు, పుస్తకాలు, పేపర్లు చదువుకుంటూ అక్కడి స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ చాలా మంది ఉన్నారు అక్కడ.

మరికొందరు మహిళలకు శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. అవన్నీ చూస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు తల్లీ కూతుళ్లు.

ఆ పల్లెటూరిలోనే కాకుండా జిల్లా మొత్తంలో నిరాదరణకు గురైన మహిళలకు వారి అర్హతకు తగ్గట్టుగా కార్పొరేషన్ శిక్షణ, ఉపాధి, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ప్రసిద్ధ శిక్షణా సంస్థల ద్వారా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యుటీషియన్‌లో శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్స్ అందిస్తూ ఉపాధి ఏర్పాటు చేస్తూ గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం నిర్మిస్తున్నారు. పల్లెటూర్లు దేశానికి పట్టుకొమ్మలు అన్న మాటను నిజం చేసి చూపిస్తున్నారు ట్రస్టు రూపకర్త 'ఉమా మాధవ్'. మాధవ్ మేనల్లుడే మురళి.

వాళ్లకు మురళి ఎదురుపడి ఇద్దరినీ రిసీవ్ చేసుకున్నాడు.

సభా ప్రాంగణం మహిళలతో నిండిపోయింది.

ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర మంత్రిగారు, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌గారు వేదిక పైన ఆసీనులై ఉన్నారు.

వేదిక సందడిగా ఉంది. కార్యక్రమం ప్రారంభించడానికి వ్యవస్థాపకులు మాధవ్‌గారు వేదికపైకి వీల్ ఛైర్లో వచ్చారు. కొన్నేళ్ల క్రితం ఆయనకు పక్షవాతం వచ్చింది. అందువల్ల వీల్‌ఛైర్లో వచ్చారు.

మాధవ్‌ని చూసి రూప తల్లి ఒక్కసారిగా షాక్ అయ్యి సొమ్మసిల్లి పడిపోయింది. తన మనసు కలవరపడిందే నిజమైంది. తనే ఉమాదేవి. తన భర్తే మాధవ్.

ట్రస్టు ఆసుపత్రిలోనే ఆమెకు చికిత్స అందించారు.

ఆమె బెడ్ పక్కనే ఛైర్లో కూర్చుని ఆమె చెయ్యిని పట్టుకుని ఉన్నాడు భర్త మాధవ్.

భర్తను ఉద్దేశిస్తూ "మాధవ్! నన్ను క్షమించు. నిన్ను నేను మర్చిపోయి బతుకుతున్నా.

కానీ నువ్వు మాత్రం నన్ను తలుచుకుంటూ నా పేరుతో ఎందరికో బతుకునిస్తూ పల్లెల స్వచ్ఛమైన గాలిలా ఇక్కడి పవిత్రమైన మట్టిలా ఎంతో ఓర్పుతో పట్నంలో బతికేదే జీవితం కాదు పల్లెటూళ్లలో కూడా జీవం నిండిన జీవితాలు ఉంటాయని, అభివృద్ధికి ఆనవాలు పట్నాలు అయినా, వాటి పురోభివృద్ధికి మాత్రం దారులు వేసేది పల్లెటూర్లు. ఇక్కడి మనుషులు అని నిరూపించావు. నేను ఓడిపోయాను" అంది కన్నీళ్లు నిండిన కళ్లతో.

లాన్‌లో కూర్చుని ఉన్నారు మురళి, రూప.

రూపగారూ, చూశారా విధి? నేను మావయ్యను అత్తమ్మ గురించి ఎప్పుడు అడిగినా పల్లెటూరు, అక్కడి మనుషులను వద్దనుకుని వెళ్లిపోయిన వాళ్ల గురించి తెలుసుకుని ఏం చేస్తావురా?" అనేవాడు.

మా అమ్మా అంతే! "ఫ్యామిలీ కన్నా సమాజ సేవనే ఇష్టం, పల్లెటూరు జీవితాలు స్వచ్ఛమైనవి.. అంటూ వదిలేసినవాళ్ల గురించి నీకెందుకే" అంటూ నా నోరు మూయించేది" చెప్పింది రూప.

అవును... ఇద్దరు మొండి పంతంతో నిండు జీవితాల్ని పోగొట్టుకున్నారు. మా అమ్మా, నాన్న నా నాలుగో ఏటనే పోయారు. అప్పటి నుండి ఇప్పటిదాకా ఇక పైన కూడా నాకు అన్నీ మా మాధవ్ మావయ్యే. ఇక్కడే విలేజ్‌లో వుంటూ వ్యవసాయాన్ని నమ్ముకుని ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తూ పంటలు పండిస్తూ పసిడిలాంటి పల్లెటూరి జీవితాన్ని అనుభవిస్తూ ఉండేవాడు.

మా నాన్న రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోవడంతో అమ్మ, నేను మామయ్య పంచన చేరాం. మావయ్యకు కొత్తగా పెళ్లయిన రోజులవి.

అత్తయ్య, మామయ్యలది లవ్ మ్యారేజ్.

"ఈ పల్లెటూరి జీవితం మనకు వద్దు, మనం సిటీకి పోదాం అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుందాం" అంటూ అత్తయ్య మామయ్యకు చెప్తూ ఉండేది.

పెద్దలను ఎదిరించి మరీ పెళ్లి చేసుకున్నారు. అలాంటి సమయంలో మావయ్య పంచన చేరాం మేం.

అప్పటికి "ఈ పల్లెటూరి జీవితం మనకు వద్దు, మనం సిటీకి పోదాం అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుందాం" అంటూ అత్తయ్య మామయ్యకు చెప్తూ ఉండేది. కానీ మావయ్యకు పల్లెటూరు అంటేనే ఇష్టంగా ఉండేది. ఈ లోపల మేం మామయ్య ఇంటికి రావడంతో మామయ్య "సిటీ లేదు ఏమీ లేదు. ఇక్కడే ఉంటూ వ్యవసాయం చేసుకుందాం" అని కరాఖండిగా చెప్పేశాడు.

మామయ్య మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకునేవాడు. ఆ ప్రేమనే కాదు, మామయ్యతో పల్లెటూరులో కాపురం అత్తయ్యకు నచ్చలేదు. అలా అని అత్తయ్య మంచిది కాదని కాదు. చాలా మంచిది. అయితే కాస్త మొండిది. అంతే!

నా వల్లే అన్నయ్య కాపురంలో గొడవలవుతున్నాయి. అందుకే దూరంగా వెళ్లాలని నిశ్చయించుకుంది మా అమ్మ. కానీ ఒంటరిగా బతుకుపోరు గెలవాలన్న గట్టి నిర్ణయం తీసుకోలేదు. తాను లేకుంటే అన్నయ్య, వదిన సంతోషంగా ఉంటారని ఆత్మహత్య చేసుకుంది. జీవితంలో ఎలాగైనా గెలిచి నిలవాలని మాత్రం ఎందుకు అనుకోలేదో.. నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఇటు నా జీవితం, అటు మామయ్య జీవితం అంధకారం అయ్యాయి.

నీ వల్లనే నా చెల్లెలు చనిపోయిందని మామయ్య అనడంతో గొడవలు మరింతగా పెరిగాయి.

"ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. నీతో సంతోషంగా ఉండాలనుకోవడం తప్పా? అని నిలదీసిన అత్తయ్యపై చేయి చేసుకున్నాడు. దాంతో ఇద్దరి మధ్య ఎడబాటు ఏర్పడింది. అప్పటికే గర్భవతిగా ఉన్న అత్తయ్య పుట్టింటికి వెళ్లిపోయింది.

నాటి నుండి మామయ్య ఒంటరివాడయ్యాడు. ఇన్నేళ్లయినా అత్తయ్య ఆచూకీ లేదు. మామయ్య కూడా అటు వైపుగా అడుగులు వేయలేదు. కానీ రోజూ అత్తయ్యని తలుచుకుంటూ తన ప్రేమకు గుర్తుగా ఈ మహిళా ట్రస్టును నిర్వహించి జీవితంలో నిరాదరణకు గురైన మా అమ్మ లాంటి ఎందరో మహిళలను చేరదీస్తూ, వారికి జీవనోపాధి కల్పిస్తూ, ఆయన సంపాదనలో డెబ్భై అయిదు శాతం ఈ ట్రస్టుకు కేటాయిస్తూ వారికి జీవితం మీద కొత్త ఆశలు చిగురింపచేస్తూ కాలాన్ని వెళ్లదీస్తున్నాడు" చెప్పాడు మురళి.

మ్యాటర్ మొత్తం అర్థమైన రూప మురళి చెయ్యిని తన చేతిలోకి తీసుకుని "అనుబంధాలు అంతే బావా. దూరం అవుదామనుకున్నా మరింత దగ్గరవుతాయి" అంది ప్రేమ నిండిన స్వరంతో.

✦

రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

ఆంధ్రత్వం-ఆంధ్రభాష

జయసూర్య

తమిళనాట అడయపాలంలో 1520లో జన్మించిన సర్వతోముఖ సంస్కృత మహా విద్వాంసుడు అప్పయ్య దీక్షితులుకు, ఆంధ్రులన్నా, ఆంధ్రభాష అన్నా ప్రేమాభిమానాలుండేవి. ఆంధ్ర భాషా ప్రశంస సందర్భంలో అప్పయ్య దీక్షితులు పేర్కొన్న ఈ శ్లోకాన్ని, పండితులు ప్రస్తావిస్తుంటారు.

"ఆంధ్రత్వ మాంధ్రాభాషాచ ప్రాభాకర పరిశ్రమః
తత్రాపి యాజుషీ శాఖా నాల్పస్య తపసః ఫలమ్"

శతాధిక గ్రంథకర్త అయిన అప్పయ్య దీక్షితులు అద్వైత వేదాంత మూలస్తంభాయమానులైన అయిదుగురు విద్వాంసులలో సుప్రసిద్ధులు. శ్రీ శంకర భగవత్పాదులచే ప్రతిపాదితమైన శుద్ధాద్వైత సిద్ధాంత తత్త్వం, ఈ మహా వేదాంతి అనుసరించారు. శైవ, వైష్ణవ మత వివాదాల ఆ కాలంలో శివుడే సర్వదేవ ప్రకృష్టుడని వివరించే శ్లోకాలలో ఒకటిగా అప్పయ్యదీక్షితుడు చెప్పినట్లుగా ఆంధ్ర భాషా ప్రశంస ప్రచారంలోకి వచ్చింది. 'అప్పయ్య దీక్షిత చారిత్రము' అనే వివరణ, 1829 కలకత్తా పురాతత్వ విభాగం, రాయల్ ఏసియాటిక్ సొసైటీ తెలుగు పండితుడు, అనువాద ప్రముఖుడు అయిన కావలి వెంకటస్వామి డెక్కన్ కవుల జీవిత చరిత్రలో అప్పయ్యదీక్షితుల ప్రసక్తి వుంది. తొలుత, తెలుగులో ఆ చరిత్ర గురజాడ శ్రీరామమూర్తి రచించారు. పరిశోధనలలో అప్పయ్య దీక్షితులు రచించిన గ్రంథాల నుండి బయటపడిన కొత్త విషయాలలో పైశ్లోకం, బహిర్గతమైంది. ఆ తర్వాత సుప్రసిద్ధ సంస్కృత పండితులు టి.ఆర్.చింతామణి రాసిన వ్యాసాలను ప్రముఖ విద్వత్కవి నిడుదవోలు వెంకటరావు అనువాద పీఠికతో సహా వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1951లో గురుజాడ శ్రీరామమూర్తి రచనను ప్రచురించింది. అప్పయ్యదీక్షితులు ఆంధ్రత్వాన్ని, ఆంధ్ర భాషను ప్రశంసించటం, వావిళ్లవారు ప్రచురించిన నిడదవోలువారి పీఠికానువాదంలో వివరింపబడింది.



అపర శంకరాచార్యునిగా ప్రఖ్యాతి పొందిన అప్పయ్య దీక్షితులు వంటి సంస్కృత మహాపండితుడు ఆంధ్ర భాషను ప్రశంసించిన వైఖరి మన భాషా ప్రాచీనతా మహోన్నతికి అద్దం పడుతోంది. శివ పరాత్పరత్వాన్ని స్థాపించే విధంగా శివుడే సర్వదేవ ప్రకృష్టుడని ప్రకటించటానికి అప్పయ్య దీక్షితులు ఈ శ్లోకాన్ని కూడా ఉదహరించడం విశేషాంశం. ఆంధ్ర భాషలో సహధర్మచారిణికి 'వశ' అనే వాడుకమాట వుండేదట. ఆ పలుకు పలుమార్లు ఉచ్చరించినట్లయితే, ఆ కారణంచే శివ అనే పేరు స్మరించబడి, ఆంధ్రత్వం మరింత ఉత్కృష్టమయ్యిందనే భావన కూడా ఉంది. ఈ సంస్కృత విద్వత్కవి అప్పయ్య దీక్షితులు శ్రీకృష్ణదేవరాయలకు సన్నిహితులని లేదా తదనంతరం చంద్రగిరి వెంకటపతిరాజు ఆస్థాన కవిగా ఉన్నారనే చారిత్రక ఆధారాలున్నాయి.

"ఆంధ్రత్వ మాంధ్రా భాషాచ" శ్లోకంలోని అర్థాన్ని పరిశీలిస్తే ఆంధ్రత్వం, ఆంధ్రభాష రెండూ కూడా అత్యంత ప్రాచీనమైనవని తెలుస్తోంది. ఆ శ్లోకంలోని 'ప్రాభాకర' అనే మాటకు సంస్కృత నిఘంటువులలో మీమాంస తత్త్వ శాస్త్ర సన్నిహితార్థం ముడిపడి వుంది. అనల్పమైన తపసః ఫలం సమకూర్చగల యాజుషీ శాఖలో ఆంధ్ర భాషా వైశిష్ట్యం ఇమిడి వుండటం స్పష్టమవుతోంది. మన సంస్కృత కవులకు ఆంధ్ర భాష పట్ల వున్న నిరాసక్తత, నిరాదరణ కారణంగా ప్రాచీన ఆంధ్రత్వం, ఆంధ్ర భాష అడుగంటిపోయినట్టు భావించవలసి వస్తోంది.

ప్రాచీన హోదా సాధించడానికి, ఆంధ్ర భాషా ప్రాభవం మరుగున పడటంతో తెలుగు భాష అష్టకష్టాలు పడింది. కేంద్రం తమిళాన్ని గుర్తించింది. తెలుగును ముందు పక్కన పెట్టింది. తెలుగును గుర్తించాక, తమిళ తంబీలు అడ్డుపడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలంలోని కురిక్యాల గ్రామ శివారులో ఒక కొండపై లభించిన జినవల్లభుడి శాసనంలోని కంద పద్యం తెలుగుకు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉందని ఆధారంగా నిరూపించటంతో ఎట్టకేలకు ప్రాచీన హోదా లభించింది. ఆ కొండపై ఉన్న జిన విగ్రహం, చక్రేశ్వరి అనే శాసనదేవి ప్రతిమలకు మూడు భాషలలో సంస్కృతం, కన్నడం, తెలుగులో ఓ శాసనం రాసి ఉంది. ఈ శాసనాన్ని ప్రసిద్ధ కన్నడ ఆదికవి పంపని తమ్ముడు జినవల్లభుడు రాయించినట్లు చరిత్ర స్పష్టం చేస్తోంది.

పంప మహాకవి పూర్వులు తెలుగునాట కమ్మనాటి (గుండ్లకమ్మతీరం)లోని వంగిపర్రు గ్రామానికి చెందినవారని, వేములవాడ చాళుక్య రాజుల ఆశ్రయం పొంది సబ్బి మండలంలో స్థిరపడ్డారని తెలుస్తోంది. ఈ శాసనంలో మూడు కందపద్యాలున్నాయి. క్రీ.పూ.946 కాలం నాటివి. అదే విధంగా జనగామ జిల్లాలోని గూడూరు శిలా స్తంభంపై ఒక వైపు తెలుగు శాసనం వుంది. చాళుక్య చక్రవర్తి 6వ విక్రమాదిత్యుడు (క్రీ.శ.1076-1127) బమ్మెర గ్రామాన్ని దానం యిచ్చిన శాసనం అది. వరంగల్ జిల్లాలోని కొండపర్తి, కొరవి శాసనాలు క్రీ.శ.935 కాలం నాటివి.

జినవల్లభుడి శాసనంలోని కందపద్యం

ఒక్కొక్క గుణంబు కల్గుదు
రొక్కణ్ణిగా కొక్క లెక్క లేదెవ్వరికిన్
లెక్కింప నొక్కలక్కకు
మిక్కిలి గుణపక్షపాతి గుణమణ గుణముల్.

శతాబ్దాల చారిత్రక సామాజిక, రాజకీయ, కళా, సంగీత, సాహిత్య నేపథ్యంలో కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాలలో తెలుగు ప్రాభవం ఎంతైనా ఉంది. కృష్ణదేవరాయలు, పంపన మహాకవి, సుబ్రహ్మణ్య భారతి త్యాగరాజు, అప్పయ్య దీక్షితులు.. ఇలా ఎందరో మహాత్ములు, మహనీయులు ప్రాంతీయ, భాషా పరమైన ఎల్లలు లేని విశాల దక్షిణ భారతావనిలో విలసిల్లారు. 21వ శతాబ్దం ప్రస్తుత మూడవ దశాబ్దంలో మిడిమిడి జ్ఞానంతో తెలుగు జాతిని అవమానించి ఒక తమిళ నటి పోలీస్ కేసుల్లో ఇరుక్కోవడం, శృతి మించిన వేలంవెర్రిగా భావించవలసి వస్తోంది.

అత్యాశ

యామిజాల జగదీశ్

అదృష్టాన్ని నమ్మేవారికి అత్యాశ రాసుకున్నది.. ఆశను త్యజించమన్నాడు బుద్ధుడు. అన్నింటికీ ఆశపడు అంటారు మరొక ఆధ్యాత్మికవేత్త. ఆశను త్యజించడమంటే జీవించడం మొదలుకుని మౌలికమైన జీవితానికి అవసరమైన ఆశలను వదులుకోమని బుద్ధుడు చెప్పలేదు. ఆయన చెప్పదలచుకున్నది అత్యాశ గురించి.

సద్గురు జగ్గీ వాసుదేవ్ మాటల ద్వారా బుద్ధుడి అభిప్రాయానికి భిన్నంగా అత్యాశను ఆయన సమర్థించినట్టు అర్థం చేసుకోవడమూ పొరపాటే అవుతుంది. ఈ ప్రపంచంలోని అన్ని జీవరాశులపైనా ప్రేమను, పాశాన్ని ఉంచమనే ఆ వివరణ.

ఇప్పటి జీవిత విధానంలో శ్రమను మాత్రమే నమ్ముకున్నవారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. శ్రమించకుండా లభించే సంపాదనను రుచి చూసాక దానినే జీవిత తత్వంగా భావించేవారు ఎక్కువ మందే ఉన్నారు.

లంచం అనే ఓ భయంకరమైన జబ్బు ఈ సమాజంలో ఎన్నో సంవత్సరాల క్రితమే వేళ్లూనుకుంది. ఇప్పుడు ఓ అధికారి తన బాధ్యతలను నిర్వర్తించడానికి లంచాన్ని ఆశిస్తే అది అనైతికమనో, ఆశ్చర్యకరమనో ఎవరికీ అనిపించడం లేదు. పరిమితికి మించి ఆ అధికారి డబ్బులు అడిగితే అప్పుడు కోపం వస్తోంది తప్ప ఓ న్యాయమైన రీతిలో డబ్బులు ఇచ్చి పనులు చేయించుకుంటున్నవారి సంఖ్య ఎక్కువవుతూనే ఉంది. ఇందుకు మనిషి ఏమాత్రం ఆలోచించడం లేదు.

ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం కన్నా అందుకు అవసరమైన రీతిలో శ్రమపడే సూచనలు చేస్తే బాగుంటుంది. కానీ అది చేసేదెవరు, వినేదెవరు? ప్రతి రాజకీయ పార్టీ వోటరుకు డబ్బులు ఇవ్వడానికి సంసిద్ధపడుతోంది. ప్రజల ఈ ఉచిత అత్యాశను దాదాపుగా ప్రతి వాణిజ్య సంస్థ అనుసరిస్తోంది. సెల్‌ఫోన్ కొంటే మరొక సెల్‌ఫోన్ ఉచితం; సబ్బు కొంటే బ్రష్ ఉచితం; టీవీ కొంటే డీవీడీ ప్లేయర్ ఉచితం; వాషింగ్ మిషన్ కొంటే మిక్సీ ఉచితం; పాత నగకు కొత్త నగ; ఒక చొక్కా కొంటే మరొక చొక్కా ఉచితం.. అంటూ ఎటు చూసినా ఉచితం జనాన్ని పిలుస్తూ ఉంటుంది.

ప్రజల ఈ అత్యాశ ఈ సమాజంలో ఎన్ని రకాల తప్పులకు తెర తీస్తోందో అర్థం చేసుకోవాలి. ఒకవేళ జనానికి తెలిసినా సరే ఉచితాల కోసం పరుగులు తీయడం జరుగుతూనే ఉంది.

అన్ని బ్యాంకులూ సేవింగ్స్‌కి వడ్డీ ఇస్తున్నాయి. కానీ అధిక వడ్డీకి ఆశపడి ఆకర్షణీయమైన ప్రకటనలను చూసి డబ్బు కట్టేటప్పుడు ఇచ్చే ఉచితాలకు మోసపోయేవారు ఉంటూనే ఉన్నారు.

మరొకవైపు అదృష్టరాయి వ్యాపారులలో కొందరు, నకిలీ

స్వామీజీలు, నకిలీ జ్యోతిష్యులు.. ఇలా పలువురు పలు విధాలుగా జనాన్ని దగా చేస్తూనే ఉన్నారు.

ఫలానా రంగు రాయిని కొంటే లాభం, ఈ రాయిని ధరిస్తే అదృష్టం ఇంటి తలుపులు తడుతుందని, బంగారం కాసులు కురిపిస్తుందని చెప్తుంటారు. ఆ మాటలు నమ్మి వారు చెప్పిన రాయిని కొంటారు. తీరా అది నకిలీది కావడంతో వీరికి జరిగే మేలేమీ ఉండదు.

మహిళా భక్తులు నకిలీ స్వామీజీల చేతిలో మోసపోతే; మగవారు అడ్డదారిలో డబ్బులు సంపాదించడానికి పరుగులు తీస్తారు. అదృష్టాన్ని వెతుక్కుంటూ పరుగులు తీస్తారు. వాటిలో ఒకటి పేకాట; మరొకటి గుర్రప్పందాలు.

ఇలాంటి జూదాల వల్ల దగా పడ్డవారు ఎందరెందరో ఉన్నారు. వారి కన్నీటి గాథలను వింటుంటే అయ్యో పాపం.. అనిపిస్తుంది. కానీ ఏం లాభం. ఒకరు చెప్తే వినరు. ఏమానఏమాత్రం కష్టపడకుండా డబ్బులు గడించెయ్యాలన్న అత్యాశే వారు మోసపోవడానికి కారణం అవుతుంది. ఒక ఉద్యోగానికి వేలాది మంది అప్లికేషన్ పెట్టుకుంటే పది మందికే లభించడం వల్ల అదృష్టంలోకి చేరుతారా లేక ప్రతిభను పెట్టుబడిగా పెట్టుకుని సన్మార్గంలో సంపాదిస్తారా? ఏదేమైనా గడించడమనేది మన చేతిలో ఉంటుంది.

చలనచిత్ర పరిశ్రమ విషయానికొస్తే అందులో ఎన్నో విభాగాలు ఉన్నాయి. అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే విజయం దక్కుతుంది. అంతేతప్ప ఎవరో ఒక్కరివల్ల మాత్రమే లాభాలు గడించెయాల్యనుకోవడం అత్యాశే అవుతుంది. అంకితభావం, కఠోర శ్రమ, ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. అంతేతప్ప అదృష్టంతో మాత్రమే సినీ రంగంలో రాణించేయొచ్చు అని అనుకోవడం సరికాదు. శ్రమ ఒక్కొక్కప్పుడు వెంటనే ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. కానీ ఓర్పుతో అనుకున్న లక్ష్యానికి కట్టుబడి శ్రమిస్తే లాభం తప్పక ఉంటుందని గ్రహించాలి. అంతేతప్ప కేవలం అదృష్టం మాత్రమే తనను ఈ ఉన్నత స్థితికి తీసుకువచ్చిందనే వారిని చూడలేం.

అత్యాశ, అదృష్టం, అడ్డదారి, ఉచితం.. ఇవన్నీ మనసు నుంచి తీసేసి తెలివితేటలతో ఆలోచించి కఠిన శ్రమతో ముందుకు పోతే సత్ఫలితం ఖాయం. జీవితమూ అందంగా ఉంటుంది. ప్రశాంతంగా ఉంటుంది.

శ్రమే ఉన్నతం. అదే విజయానికి మూల మంత్రం. దీనిని మరచిపోకూడదు. ఇది అర్థం చేసుకుని జీవిత ప్రయాణాన్ని కొనసాగిస్తారని నా నమ్మకం, నా సూచన, నా హితవు.

ఇట్లు

అత్యాశ

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

పాత ఇంటిని కొనుగోలు చేస్తున్నారా?

(గత వారం తరువాయి..)

"బంగారు కొమ్ము"

కంసాలి వాళ్లను అడిగితే దీనిని చేసి ఇస్తారు. ఇది చాలా చిన్నగా... అంగుళం వరకు ఉంటుంది.

బంగారు కొమ్ము అవకాశం లేనప్పుడు తాపీమేస్త్రి దగ్గర ఉండేటటువంటి (పలుగు, పార ఉపయోగించకుండా), తాపీ తీసుకొని శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలు అద్ది, దానిని ఇంటి యజమాని బంగారు కొమ్ముకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించ వచ్చు. తర్వాత ఇంటిని పూర్తిగా కూలగొట్టటం మేస్త్రీలకి కానీ కాంట్రాక్టర్స్ కి కానీ అప్పగించాలి. వాళ్లు పలుగులు, పారలు, జెసిబిలు ఉపయోగిస్తూ మిగతా నిర్మూలన కార్యక్రమం చేస్తారు.

ఇల్లు కులగొట్టే ప్రక్రియను ఇంటి యజమాని దగ్గర ఉండి పర్యవేక్షించ వద్దు. అలాగని ఈ ప్రక్రియ చేసిన తర్వాత ఏ పని మీద వెళ్లకూడదు. నేరుగా ఇంటికి వెళ్లి పోవాలి. అంటే... మనం అప్పటికే వేరే దగ్గర ఎక్కడో ఒక ఇల్లు తీసుకొని ఉంటాం కదా, అక్కడికి వెళ్లిపోవాలి. అక్కడ కొంత సమయం గడిపిన తర్వాత ఎటైనా వెళ్లవచ్చు. కానీ ముఖ్యమైన పనులు ఏవీ ఆరోజు చేయకూడదు. పెళ్లిళ్లకు, గృహప్రవేశాలకు మొదలైన శుభకార్యాలకి ఆరోజు వెళ్లకూడదు.

మేస్త్రిలు కానీ కాంట్రాక్టర్ కానీ మిగతా ఇంటిని నిర్మూలించే కార్యక్రమాన్ని ఎక్కువ రోజులు కొనసాగనీయకుండా, వీలైనంత తొందరగా పూర్తి చేసేటట్టు చూసుకోవాలి. కేవలం గోడలు మాత్రమే తీసేయకుండా, కింద పునాదులు ఉంటే వాటిని పునాదిరాళ్లతో సహా మొత్తం అన్ని పునాదులు తీసేయాలి. ఆ తర్వాతనే నిర్మాణాన్ని మొదలు పెట్టుకోవాలి. పైన గోడలు మాత్రం తీసేసి కింద పునాది రాళ్లను తీసివేయకుండా ఎట్టి పరిస్థితుల్లో కొత్త ఇల్లు కట్టకూడదు.

ఈ విధమైన ప్రార్థనలు, పాత నిర్మాణాన్ని తీసేయటం; కొత్త నిర్మాణాన్ని కట్టడం... ఇవన్నీ కూడా ఎంతో మంచి ఫలితాలను ఇస్తాయి. నిర్మాణాన్ని కూలగొట్టడం మనం దగ్గర ఉండి చూడకూడదు. ఈ విషయం బాగా గుర్తు పెట్టుకోండి. ఈ విధంగా పాత ఇంటిని నిర్మూలించి కొత్త ఇంటిని కట్టే పద్ధతిని ఉపయోగించడం వలన, కొత్త ఇంటిని మనం సజావుగా ఆటంకాలు లేకుండా కట్టుకోగలుగుతాం. అది కూడా శుభ ఫలితాలను ఇచ్చేదిగా కట్టుకోగలుగుతాం. పాత ఇంటి అనుగ్రహం కొనసాగుతుంది. పాత ఇంటి అనుగ్రహం మన పైన, మన తర్వాతి తరాల పైన చెక్కుచెదరకుండా ఉంటుంది. అది చాలా మంచిది.

2) ఒకవేళ మీరు ఆ స్థలాన్ని అంటే ఆ ఇల్లు ఉన్న స్థలాన్ని కొని, అప్పుడే ఆ ఇంటిని తీసేసి కొత్త ఇల్లు కడుతున్నప్పుడు కూడా ఆ పాత ఇంటికి , కూష్మాండ బలిని సమర్పించి విన్నపం లేదా సంకల్పం ఆ ఇంటికి ఇలా చెప్పుకోవాలి.

"ఈ గృహం/ఈ స్థలాన్ని మాకు ప్రాప్తింపచేసినందుకు కృతజ్ఞతలు. ఈ స్థలంలో పాత ఇంటిని తీసేసి నూతన గృహ నిర్మాణం చేసుకోవటానికి మనకి సంకల్పాన్ని, అవకాశాన్ని ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎంతో మందికి ఎన్నో తరాలుగా వివిధ కుటుంబాలకి ఆశ్రయం కల్పించి ఇప్పుడు మనకు ప్రాప్తింపచేసినదుకు కృతజ్ఞతలు అని చెప్పుకోవాలి.

సత్ఫలితాలు పొందేటట్టుగా పాత ఇంటిని తీసేయడానికి అనుమతి కోరాలి. పాత ఇంటిని నిర్మూలించడానికి కూడా అనుమతి కోసం ప్రార్థించాలి. నిర్మూలన క్రమంలో ఏదైనా అపరాధం జరిగినా, జరుగబోతున్నా అందుకు క్షమించమని, నూతన గృహ నిర్మాణానికి అనుమతిని ఇవ్వమని కోరుకోవాలి.

పాత ఇల్లు కూలగొట్టేటప్పుడు యజమాని దగ్గర ఉండి పర్యవేక్షించకూడదు. ఆరోజు ముఖ్యమైన పనులు పెట్టుకోకూడదు. శుభ కార్యాలకు వెళ్ళకూడదు. ఈ విధంగా చేయటం వల్ల ఆశించిన ఫలితాలు ఉంటాయి.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్తలో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్ వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ....
పుట్టిన తేది : ....
జన్మ నక్షత్రం: ....తల్లి పేరు: ....
చిరునామా:..

వివేకంతో ఆలోచించాలి

కస్తూరి మురళీకృష్ణ

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం.

ఆ కాలంలో బోధిసత్త్వుడు సింహంలా జన్మించాడు. అడవిలో నివసించేవాడు.

అదే సమయంలో పశ్చిమ సముద్రం పక్కన మారేడు చెట్లు, తాడిచెట్లు గుంపులు గుంపులుగా ఉండేవి.

ఒక కుందేలు మారేడు చెట్టు మొదట్లో జీవించేది. తాడిచెట్టు నీడలో ఆడుకునేది, విశ్రమించేది.

ఒకరోజు అది తాడిచెట్టు నీడలో విశ్రమించేది.

ఈ భూమి ఏదైనా ఒకరోజు తలకిందులయిపోతే నేనేమైపోతాను" అని అనుకునేది.

అది అలా ఆలోచిస్తున్న సమయంలో మారేడు చెట్టు నుండి ఒక పండు ఊడి తాటి ఆకు మీద పడింది, శబ్దం అయింది.

ఆలోచనల్లో ఉన్న కుందేలు ఉలిక్కిపడింది.

"అమ్మో, భూమి తలకిందులయింది" అని అనుకుంది.

కుందేలు ఆలోచనలన్నీ భూమి తలకిందులవటం గురించి ఉండటంతో, ఆ శబ్దం భూమి తలకిందులయ్యే శబ్దంగా భ్రమించి, భయపడి, పరుగు తీయటం ఆరంభించింది కుందేలు.

అతి వేగంగా భయంతో అరుస్తూ పరుగెత్తుతున్న కుందేలును చూసి, ఇంకో కుందేలు కూడా దాని వెనకే పరుగెత్తటం ప్రారంభించింది.

"ఏమైంది? ఎందుకు భయంతో పరుగెత్తుతున్నావు?"

కుందేలు వెనకే వస్తూ అడిగింది రెండో కుందేలు.

"నన్నేమీ అడగకు, పరుగెత్తు" అని వేగం పెంచింది మొదటి కుందేలు.

ఈ రెండు కుందేళ్ల పరుగెత్తటం చూసి ఒకటొకటిగా ఇతర కుందేళ్ల సైతం వాటి వెంట పరుగిడసాగాయి.

"ఏమైంది?" ఎందుకు? మనం ప్రాణ భయంతో పరుగెత్తుతున్నాం?"

మొదటి కుందేలు పరుగు ఆపకుండా, వెనక్కి తిరిగి చూడకుండానే సమాధానం ఇచ్చింది.

"పరుగెత్తండి.. భూమి తలకిందులవుతోంది".

దాంతో మిగతా కుందేళ్ల కూడా పరుగువేగం పెంచాయి.

ఈ రకంగా కొన్ని వేల కుందేళ్ల గుంపు ఎటు పరుగెత్తుతున్నాయో, గమ్యం ఏమిటో కూడా తెలియకుండా కుందేళ్ల ఇలా గుంపులా పరుగెత్తటం చూసి ఒక లేడి కూడా వాటి వెంట పరుగు ఆరంభించింది.

అది చూసి ఇతర లేళ్లు కూడా వాటిని అనుసరించాయి.

కుందేళ్లు, లేళ్ల పరుగెత్తటం చూసి "విషయం ఏమిటని?" అడవిపంది అడిగింది.

సమాధానం సరిగ్గా రాలేదు కానీ వాటి భయం తెలిసిన అడవిపంది కూడా పరుగు ప్రారంభించింది. దాంతో అడవి పందుల గుంపు కూడా పరుగు ప్రారంభించింది.

ఇలా ఒకటొకటిగా.. నీటిమృగం, అడవిదున్న, ఎద్దు, ఖడ్గమృగం, పెద్దపులి, సింహం, ఏనుగుల గుంపులు కూడా పరుగు ప్రారంభించాయి.

"ఏమైంది? ఎందుకు పరుగెత్తుతున్నాం?" అని అడుగుతూనే ఉన్నాయి.

"భూమి తలకిందులయ్యిందట" ఎవరో సమాధానం ఇచ్చారు.

అలా ప్రశ్న, సమాధానం చెప్పుకుంటూనే అడవి దారిన జంతువులన్నీ పరుగు పెడుతూనే ఉన్నాయి.

ఇలా జంతువులన్నీ పరుగెత్తటం చూశాడు బోధిసత్త్వుడు. విషయం తెలుసుకుందామని పరుగెడుతున్న జంతువును అడిగాడు. "ఎందుకని పరుగెడుతున్నారు? ఎటు పరుగులు తీస్తున్నారు?"

జంతువులు పరుగు ఆపలేదు.

"భూమి తలకిందువుతోంది" పరుగు ఆపకుండానే చెప్పింది.

బోధిసత్త్వుడు ఆలోచించాడు.

'భూమి తలకిందులవటం అసంభవం. ఇవి ఏదో చూసి ఉంటాయి. ఏదో అనుకుని ఉంటాయి. వీటికి నిజం చెప్పి, పరుగు ఆపకపోతే ఇవన్నీ ఇలా పరుగెత్తీ, పరుగెత్తీ నశిస్తాయి. కాబట్టి వీటి పరుగును ఆపాలి, వీటిని బతికించాలి" అని నిశ్చయించుకున్నాడు.

వెంటనే అన్ని జంతువుల కన్నా వేగంగా పరుగెత్తాడు. వాటిని దాటి ముందుకు వెళ్లాడు.

పర్వతం ఎక్కి, పర్వతం చివరన నిలబడి మూడు మార్లు భయంకరంగా సింహనాదం చేశాడు.

ఆ సింహనాదం విని పరుగెత్తుతున్న జంతువులన్నీ ఆగిపోయాయి. భయంతో వణికిపోయాయి.

వాటి మధ్యకు వెళ్లాడు బోధిసత్త్వుడు.

"ఎందుకు పరుగెత్తుతున్నారు?" అని అడిగాడు.

"భూమి తలకిందులయింది.. అందుకు" సమాధానం వచ్చింది.

"భూమి తలకిందులవటం ఎవరు చూశారు?"

"ఏమో నాకు తెలియదు"

"ఏనుగుకు తెలుసేమో?"

"నాకు తెలియదు, సింహానికి తెలుసేమో!"

"నాకు తెలియదు, పులికి తెలుసు"

"నాకు తెలియదు, ఖడ్గమృగానికి తెలుసు".

"నాకు తెలియదు. వృషభాన్ని చూసి నేను పరుగుపెట్టాను. వృషభానికి తెలుస్తుంది".

"నాకు తెలియదు, మహిషానికి తెలుసు".

"నాకు తెలియదు. నీటి మృగానికి తెలుసు".

"నాకేం తెలుస్తుంది? పందిని చూసి నేను పరుగెత్తాను"

"నాకస్సలు తెలియదు. నేను కుందేలును చూసి పరుగెత్తాను"

కుందేళ్లను అడిగితే సౌమ్యుడనే కుందేలు మొదట పరుగు ప్రారంభించినట్టు తెలిసింది.

"సౌమ్యా, భూమి తలకిందులటం నువ్వు చూశావా?" అడిగాడు, బోధిసత్త్వుడు.

"నేను చూశాను"

"ఎక్కడ నుండి చూశావు?"

"పశ్చిమ సముద్రం దగ్గర. వనంలో పడుకుని వున్నప్పుడు భూమి తలకిందులయితే ఎటు పోవచ్చని ఆలోచించాను. అంతలోనే భూమి తలకిందులయిన పెద్ద శబ్దం వినిపించింది. నేను పరుగెత్తటం ప్రారంభించాను".

దాని మాటలకు బోధిసత్త్వుడు నవ్వాడు.

"నువ్వు మారేడు పండు రాలిన చప్పుడు విన్నావు. భూమి తలకిందులయిందని భ్రమ పడ్డావు. పదండి.. నాతో రండి. ఆ తోటకు వెళ్లి చూద్దాం. భూమి తలకిందులయిందో, లేదో తెలుసుకుందాం".

జంతువులు అటు రావటానికి భయపడ్డాయి.

కుందేలు ముందు భయపడింది.

బోధిసత్త్వుడు ధైర్యం చెప్పటంతో అతడి వీపునెక్కి కూర్చుంది.

ఇద్దరూ కలిసి కుందేలు పడుకున్న చోటుకు వెళ్లారు.

"ఇదిగో.. నేను ఇక్కడ పడుకున్నప్పుడే పెద్ద శబ్దం అయింది" చెప్పింది కుందేలు.



సింహం ఆ స్థలమంతా పరిశీలనగా చూసింది.

తాటి ఆకు మీద పడి వున్న మారేడు పండును చూసింది. విషయం గ్రహించింది.

కుందేలుకు అది చూపించింది.

వెంటనే కుందేలుతో పాటు జంతువులన్నీ ఉన్న స్థలానికి వెళ్లింది.

వాటికి జరిగిన విషయం చెప్పింది.

అన్నీ తమ మూర్ఖత్వానికి నవ్వుకున్నాయి.

పరుగులు తీస్తూ ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నుంచి తప్పించినందుకు బోధిసత్త్వుడిని అభినందించాయి.

"ఈ ఆచార వ్యవహారాలు, యజ్ఞ యాగాదులు పాటించేవారు కూడా ఇలా ఎందుకు పరుగులు తీస్తున్నామో తెలియకుండా పరుగులు తీసేవారే. మంచి ఆచారంతో ప్రజ్ఞతో హృదయాన్ని అదుపులో పెట్టుకునేవారు ధీరచిత్తులు. వారు ఎవ్వరినీ గుడ్డిగా అనుసరించరు" అంటూ కథను ముగించాడు శాస్త్ర.

చివరలో "ఆ కాలంలో అందరి ప్రాణాలను కాపాడిన సింహాన్ని నేనే" అని చెప్పాడు.

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80

sunmagvaartha@gmail.com

ముత్తే ఔషధం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

దేవేంద్ర సభలో ఆ రోజున మహావిష్ణువు, దేవగురువు బృహస్పతి వున్నారు. స్వామివారు అసురులను వధించి మమ్మల్ని అమరావతిని పాలించేలా అనుగ్రహించారు. తమ కృప, కటాక్షం, శక్తీ మాకు ఎల్లప్పుడూ ఉండాలి.. అంటూ దేవేంద్రుడు విన్నవించగానే-

నారాయణుడు "దేవేంద్రా, ఇక నువ్వు అసుర భయాన్ని వీడి సమర్థవంతంగా పరిపాలన చేయి. నేను వెళ్లిస్తాను" అని బయలుదేరాడు.

ఇంద్రాదులు మహావిష్ణువును సాగనంపారు. ఇంద్రుడు బృహస్పతితో మనం దేవాసుర సంగ్రామంలో గెలిచాం. కానీ ఇదిగో.. ఈ దేవతలను చూడండి. అసురులతో జరిగిన యుద్ధంలో వీరికి గాయాలై ఎంతటి బాధను అనుభవిస్తున్నారో!" అనగానే-

అక్కడున్న వారందరూ కూడా అలాగే చెప్పుకొచ్చారు.

"బాధపడకండి. మీరంతా భూలోకానికి వెళ్లండి. కృపా సముద్రుడైన ఆ పరమేశ్వరుణ్ణి ఆరాధించండి. ఆయన మీ బాధలను తప్పక పోగొడతాడు" అని బృహస్పతి చెప్పాడు. వారిని దక్షిణ దేశంలోని వైదీశ్వరాలయానికి వెళ్లమన్నాడు.

"అలాగేనని" అందరూ వైదీశ్వరస్వామి ఆలయానికి వెళ్లి, ఆ స్వామిని ఆరాధించారు.

"కైలాసపతీ, విశ్వనాథా, వైదీశ్వరా! మమ్మల్ని కటాక్షించి మా గాయాలను నయం చేయండి ప్రభూ" అంటూ ప్రార్థించారు.

అక్కడ కైలాసంలో పరమేశ్వరుడు ఉమాదేవితో "మనం దేవతల గాయాలు మాన్పి, వారిని కటాక్షించి వద్దాం, బయలుదేరండి" అనగానే ఆ తల్లి సరేనంది.

కైలాసనాథుడు ఒక వైద్యుడి రూపం దాల్చాడు. ఉమాదేవి ఆ వైద్యునికి సహాయకురాలిగా మారి, ఇద్దరూ వైదీశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు.

అదే సమయంలో అక్కడికి బృహస్పతి కూడా వచ్చాడు. ఆయన వారితో "వైద్య శిఖామణీ, మీరు సరైన సమయంలో పార్వతీ పరమేశ్వరుల్లా సహాయపడటానికి వచ్చినట్లుగా ఉన్నారు. ఈ దేవతల గాయాలను మాన్పి, వారిని ఆదుకోండి" అని కోరాడు ఆ వైద్యుణ్ణి.

పక్కనే ఉన్న దేవి తన చేతిలో వున్న తైలపాత్రను అందించింది. పరమేశ్వరుడు ఆ పాత్ర నుండి మూలికల లేపనాన్ని తీసి వేదల గాయాలపై పూసాడు. వెంటనే వారి గాయాలు నయమయ్యాయి.

"వైద్య శ్రేష్ఠా! మీరెవరు? మీ చేతులతో లేపనం అద్దగానే మా గాయాలు ఇట్టే మాయం అయిపోయాయి" అన్నారు, దేవతలు.

వెంటనే శివపార్వతులు ప్రత్యక్షమయ్యారు. ఉమామహేశ్వరులకు దేవతలు నమస్కరించారు.

"అమ్మా, మా గాయాలను నయం చేసినందుకు కృతజ్ఞతగా ఈ ముత్యాలను స్వీకరించాల్సిందిగా మా ప్రార్థన" అంటూ ముత్యాలను అందించారు.

ఆ సమయంలో అక్కడికి షణ్ముఖుడు వచ్చాడు. "షణ్ముకా ఇటు రా. దేవతలిచ్చిన ఈ ముత్యాలను నీకు అలంకరిస్తాను" అంటూ తన చేతులతో ముత్యాలను అలంకరించింది.

అప్పుడు షణ్ముఖుడు ద్విగుణీకృతమైన అందంతో ప్రకాశించసాగాడు. దేవతలందరూ స్వామివారికి నమస్కరించారు. "స్వామీ, మీరు ముత్తు కుమారస్వామి అనే పేరుతో ఈ స్థలంలో వెలసి భక్తులను అనుగ్రహించండి" అంటూ ప్రార్థించారు.

కుమారస్వామి ప్రసన్నుడై తల్లిదండ్రులకు నమస్కరించి "దేవతల గాయాలను నయం చేసిన ఈ స్థలంలోని ముత్తే వ్యాధిని నయం చేసే ప్రసాదంగా ఇవ్వబడుతుంది" అని సెలవిచ్చాడు.

అప్పటినుండీ భక్తులు షణ్ముఖ స్వామిపై నమ్మకంతో కొలుస్తూ భక్తితో షణ్ముఖ ప్రసాదంగా స్వీకరిస్తూనే ఉన్నారు.

పార్వతీ పరమేశ్వరులు కైలాసం చేరి సమస్త ప్రాణిని కాపాడుతూనే ఉన్నారు. ✦

టెంట్ షాప్

రాము: నా చిన్నప్పుడు మా నాన్న "ఒరే! నువ్వు అందరికీ నీడనిస్తావురా" అనేవాడు, అన్నాడు రవితో.

రవి: "అందుకేనా ఇప్పుడు నువ్వు టెంట్ షాప్ నడిపిస్తున్నావు.

కష్టపడకుండా..

నాని: "నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నా చేయి చూసి నాకు సంతానం లేరని అన్నావు" అన్నాడు జ్యోతిష్యునితో.

జ్యోతిష్యుడు: "నేనూ అదేగా అన్నాను. కష్టపడకుండా ఇతరుల సొత్తు వస్తుందని".

వాట్సప్ చూసాక

అనిల్: "డాక్టరుగారూ! ఈ మాత్రలు ఎప్పుడు వేసుకోవాలి?"

డాక్టర్: "ఈ మాత్ర ఫేస్‌బుక్ చూసిన తరువాత, ఇంకో మాత్ర వాట్సప్ చూసాక".

పిల్లల మీద ఒట్టు

ప్రియ: "మోహన్! నన్ను మాత్రమే పెళ్లి చేసుకుంటానని దేవుడి మీద ఒట్టు పెట్టి చెప్పు" అంది మోహన్‌తో.

మోహన్: "ప్రియా, నా ఇద్దరు పిల్లల మీద ఒట్టు, నిన్ను మాత్రమే పెళ్లి చేసుకుంటాను" అన్నాడు ప్రియురాలితో.

నర్సు వచ్చినప్పుడు

కావ్య: "రమ్యా, మీ తాతయ్య ఐసియూలో ఉన్నారు కదా, ఇప్పుడెలా ఉంది?"

రమ్య: "ఏమోనే! తెలియదు. నర్స్ వచ్చినప్పుడల్లా కళ్లు తెరుస్తున్నాడు.

శాంతి లేదు

గురూజీ: "ఇంట్లో శాంతి, సౌఖ్యం ఉండాలి శిష్యా!"

శిష్యుడు: "పక్కింటి శాంతి నా ఇంట్లో సౌఖ్యం లేకుండా చేస్తోంది గురూజీ!"

కాంటాక్ట్స్ తీయాలి

దేవి: "విజయా! నీ పెళ్లిపనులు ఎంతవరకు వచ్చాయి?"

విజయ: "ఫేస్‌బుక్, వాట్సప్ తీసేసాను. ఇంకా కాంటాక్ట్స్, ఇన్ స్టాగ్రామ్ తీయాలి.

ఎందుకు?

రమణి: "పండూ, జిమ్‌కి వెళ్తున్నావా? ఎందుకు?

పండు: "పెళ్లి చేసుకుంటున్నాను".

రమణి: "ఔనా! మరి గిన్నెలు తోమడానికి జిమ్‌కి ఎందుకు వెళ్లడం?"

పాములు

రాజు: "చైనీస్ రెస్టారెంటుకి వెళ్లాను. బిల్ ఇద్దామనుకుంటే పర్సు లేదురా" అన్నాడు మిత్రుడితో.

సుమంత్: "అయితే పిండి రుబ్బమన్నారా?"

రాజు: "లేదురా, నాలుగు పాములను పట్టి తెమ్మన్నాడు జయమాని".

- ఈ.ఎస్.మాధవన్

విద్యకోసం

టీచర్: రామూ! నీవు స్కూలుకి ఎందుకు వస్తున్నావు?

రాము: విద్యకోసం టీచర్.

టీచర్: మరి క్లాసులో నిద్ర పోతున్నావేంటి?

రాము: ఈరోజు విద్య రాలేదుగా టీచర్!

పెళ్లి కాలేదని..

వెంగళప్ప: రాత్రి బాగా తాగి ఇంటికి లేటుగా వెళ్లినందుకు మా ఆవిడ తలుపు తీయలేదు. దాంతో రోడ్డు మీదనే పడుకున్నా.

రామారావు: మరి తెల్లారిన తరువాత తీసిందా?

వెంగళప్ప: లేదురా! తాగింది దిగింది. అప్పుడే గుర్తుకు వచ్చింది.. నాకసలు పెళ్లి కాలేదనీ, తాళంచెవి నా జేబులోనే వుందని.

వేలు పోసి

"ఏకలవ్యుడికి, మీకు తేడా ఏమిటి?" అడిగాడు మాస్టర్.

"మేం వేలు పోసి చదువుకుంటున్నాం, ఏకలవ్యుడు వేలు కోసి చదువుకున్నాడు" చెప్పారు శిష్యులు.

చంద్రుడి దగ్గరికి

బంటి: "అమ్మా, నేను కొన్ని రోజులు ఇంటికి రాను, నా కోసం వెదకవద్దు" అన్నాడు తల్లితో.

తల్లి: "ఏమైంది? నీవు ఎక్కడికి వెళ్తున్నావు?"

బంటి: మా టీచర్ చంద్రుడి మీద పాఠం చెబుతానంది. అక్కడికి వెళ్లి రావడానికి టైం బాగా పడుతుంది కదా!" బదులిచ్చాడు బంటి.

పిండి... వండాను

"అక్కయ్యా, ఏమైంది? బావగారు ఈరోజు చాలా కోపంగా ఉన్నారు?" అన్నాడు తమ్ముడు.

"ఏమో తమ్ముడూ, మీ బావగారు ఈరోజు ఏదైనా పిండి వంట చేయమన్నారు. నేను నిమ్మకాయ పిండి, పులిహోర చేసాను. ఆయన చెప్పింది చేసినా ఎందుకు ఆయన కోపంగా ఉన్నారో నాకు అర్థం కావడం లేదు.

■

సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు.
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: **9849453449, 9440927795**

మేషం

నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. కార్యజయం కలుగుతుంది. స్నేహాలు, పరిచయాల ద్వారా ప్రయోజనకరమైన టువంటి అంశాల గురించి మరింతగా తెలుసుకుంటారు. హనుమాన్ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. ఆరోగ్య సమస్యలు వచ్చే సూచనలున్నాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృషభం

కొన్ని కార్యక్రమాల నిమిత్తం చేస్తున్న ప్రయత్నాల్లో స్వయంకృతాపరాధాలు చోటు చేసుకుంటాయి. కార్యాలయంలో మారుతున్న వాతావరణం మీకు ప్రతికూలంగా అనిపిస్తుంది. ఉద్యోగం మారాలన్న ఆలోచనలు వస్తాయి. శక్తికి మించిన బరువు బాధ్యతలు మీ మీద వేసుకుంటారు. మన బాధ్యతలు మనం సరిగ్గా నిర్వహించడం లేదని విమర్శించేవారు ఎక్కువవుతారు.

మిథునం

కొంతమందితో ప్రయోజనాలను ఆశించి వ్యాపారంలో పెట్టుబడులు పెడతారు. పట్టుదలతో కొన్ని కార్యక్రమాలు ప్రారంభిస్తారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో నిత్య దీపారాధన చేయడం మంచిది. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్నేహితులు, బంధువులతో కలిసి శుభ కార్య వ్యవహారాల్లో పాల్గొంటారు.

కర్కాటక

శుభ కార్యాలు ఘనంగా నిర్వహిస్తారు. సహోదర, సహోదరిలతో మాట తూలకుండా జాగ్రత్త వహిస్తారు. కోర్టు వ్యవహారాలు, తీర్పులు అంతంత మాత్రంగా ఉంటాయి. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి. మోసం చేస్తున్నవారికి సదుపాయాలు అమర్చాలన్న విధంగా వస్తున్న తీర్పు మీకు ఏమాత్రం నచ్చదు, అలాగని వాస్తవాలను నిరూపించలేరు.

సింహం



రాజకీయాల్లో ఉన్నవారికి అనుకూలంగా ఉంటుంది. నామినేటెడ్ పదవుల కోసం చేసే ప్రయత్నాలు బాగుంటాయి. నూతన వ్యాపారం ప్రారంభించగలుగుతారు. కొత్త కొత్త ఆలోచనలు ప్రవేశపెట్టాలన్న ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. మధ్యవర్తిత్వాలు అనుకూలిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలలో పాల్గొంటారు. మీ ప్రవర్తన ఇతరుల ప్రశంసలు అందుకుంటుంది.

కన్య

మీ నేతృత్వంలో కొన్ని ఇన్స్టిట్యూట్స్, కొన్ని వ్యాపార సంస్థలు నడపటం సంతోషం కలిగిస్తుంది. అయిన వాళ్లతో సఖ్యత లేకపోవడం నిరాశకు కారణం అవుతుంది. కొంతమంది మీకు చేసే రికమండేషన్, సిఫార్సులు ఆమోదించలేక అవస్థలు పడతారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా లబ్ధి పొందుతారు.

తుల

కోపతాపాలకు దూరంగా ఉండండి. వాస్తవిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మంచి నిర్ణయం తీసుకుంటారు. సంతాన సంబంధమైన సమస్యలు వస్తాయి. అనుకోని విధంగా వాళ్ల జీవితాల్లో వస్తున్న మార్పులకు మీరు కుంగిపోతారు. వాళ్ల భవిష్యత్తు గురించి చింతిస్తారు. ఎరుపు వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయడం మంచిది.

వృశ్చికం

వ్యాపార విస్తరణ వ్యవహారాలలో అనూహ్యమైన ప్రజల ఆదరణ, ఆదాయం అందుకుంటారు. కొంత మందిని కటకటాల వెనక్కి పంపే ప్రయత్నాల్లో సఫలీకృతం అవుతారు. చేతికి కుబేర కంకణం ధరించండి. లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. దీర్ఘకాలిక ఆలోచనల ద్వారా అంతంత మాత్రపు ఫలితాలే అందుతాయి. చేయాలనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆశించిన ప్రయోజనాలు అందుకుంటారు.

ధనుస్సు

వాహన భద్రత విషయంలో జాగ్రత్త వహించండి. తరచు వాహన ప్రమాదాలకు గురవటం లేదా రిపేర్లు సంభవించటం జరుగుతుంది. స్నేహితుల ద్వారా మీరు అనుకున్న కొన్ని పనులు నెరవేర్చుకుంటారు. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టు ధరించండి. కళా, సాహిత్యకారులకు అనుకూలంగా ఉంటుంది. బ్యాంకు రుణాల కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తారు.

మకరం

సహోద్యోగులు, సహచర బృందంతో సన్నిహితంగా మెలగుతారు. వాళ్ల ద్వారా ఎప్పటికప్పుడు కీలకమైన సమాచారం అందుకుంటారు. శత్రువర్గంలోని కొంత మంది వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. చేతికి సుబ్రహ్మణ్య పాశుపత కంకణం ధరించండి. ప్రతి ఒక్క విషయం వ్యక్తిగతంగా కాక వృత్తి/వ్యాపార పరంగా మన ఎదుగుదలకు సోపానమవుతాన్న విధంగా ఆలోచనలు చేస్తారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు.

కుంభం

రాత పూర్వకమైన పత్రాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉంటారు. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు, ఉన్నత చదువుల కోసం రాసే పరీక్షల్లో మంచి మెరిట్ మార్కులని సంపాదిస్తారు. ప్రతిరోజు ప్రథమ తాంబూలం దేవీ దేవతలకు సమర్పించండి. సొంత నిర్ణయాల కన్నా పెద్దలు చెప్పిన నిర్ణయాల ప్రకారంగా నడుచుకొని వివాహం చేసుకుంటారు. శుభ వార్తలు వింటారు.

మీనం

కుటుంబ సమేతంగా విహార యాత్రలు చేస్తారు. రుణ సంబంధమైన బాధలు బాధిస్తాయి. రుణాలు తీర్చేందుకు చేసే ప్రయత్నాలు నిరాశ పరుస్తాయి. ఎప్పటికప్పుడు నూతన బాధ్యతలు, అవసరాల వల్ల రుణాలని తీర్చలేని పరిస్థితులు ఏర్పడతాయి. సంతానం పట్ల ప్రేమ కనబరుస్తారు. వారితో ఎక్కువ సమయం గడపాలన్న ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

నేను చింటూని కాదు...దయ్యాన్ని.. బాగా భయపడిపోయి
ఇంట్లో ఉన్న చాక్లెట్లన్నీ దీంట్లో వేయి...!!
Zakir...


ఏనాడైనా పని చేసి చచ్చావా?
ఇప్పుడు మాత్రం తీవెందుకు అంటున్నాడు!
Zakir...

ఆ పక్కింటోడు ఏమని చెప్పాడు?!
Zakir...

ఈ వారం కా‘ర్టూన్స్’

గడ్డివంతెనే కదా... అని తీసిపారేయకండి. పెరూలో వున్న ఈ గడ్డివంతెనను కేస్వాచకా అని పిలుస్తారు. ప్రతి సంవత్సరం పాతది తొలగించి కొత్త ది నిర్మించడం దీని ప్రత్యేకత. వంతెన నిర్మించిన పద్ధతి యునెస్కో గుర్తింపు పొందింది. వంతెన మీద నడవాలంటే పర్యాటకులు టికెట్ తీసుకోవాలి.